ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 27.02.2026 | సంపుటి : 12 సంచిక : 219 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్ర

### ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద బుక్‌ను నిషేధించిన సుప్రీం


న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడం వివాదం అవుతోంది. ఈ అంశాన్ని సుమోటోగా పరిగణించిన సుప్రీంకోర్టు.. గురువారం విచారణను ప్రారంభించింది. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్రేనంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో బాధ్యులకు శిక్ష పడాలని సీజేఐ తీవ్రంగా స్పందించారు ఈ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి కేంద్రం మిగతా 2లో..

## ప్రభుత్వానికి అలాంటి ఉద్దేశ్యం లేదు

ఎన్‌సీఈఆర్ పాఠ్యాంశం వివాదం వేళ కేంద్రం స్పందన



2లో..



## జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా

- బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ అదనపు బాధ్యతలు
- తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ..
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం
- 45 మందిని స్థానచలనం చేస్తూ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు మిగతా 2లో..



## తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ..

# అవమానాన్ని భరించరు

### తెలంగాణకు వీరపోరాట చరిత్ర ఉంది.. ఆ స్ఫూర్తితో చేయండి

- శిక్షణ పూర్తి చేసుకున్న గ్రూప్1,2 ఉద్యోగులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- సమక్క సారక్క, కాకతీయులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారు
- ఉద్యోగం వచ్చిందన్న సంతోషం లేకుండా న్యాయస్థానాల్లో లిటిగేషన్ పెట్టారని ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని స్వీకరించరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాలకులకు వ్యతిరేకంగా కొట్లాడేవారు శ్రీమంతులు కాదని పేర్కొన్నారు. సమక్క, సారక్క, కాకతీయులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న గ్రూప్1, 2 అధికారుల వెలిడిక్టరీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందులో 271 మంది గ్రూప్1, 171 మంది గ్రూప్2 అధికారులు, 51 మంది మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు ఉన్నారు.స్వాతంత్ర్యానంతరం నల్గొండ మిగతా 2లో..

మీకు ఉద్యోగాలు వచ్చాయన్న సంతోషాన్ని కొంతమంది ఒక్క రోజు కూడా మిగిలించలేదు. ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకుందని గిట్టని వాళ్లుప్రచారం చేశారు. న్యాయస్థానాల్లో కూడా లీగల్ లిటిగేషన్లు పెట్టారు. ఎక్కడా కూడా ప్రభుత్వం తప్పులు చేయలేదు. ఆ అవకాశం ఇవ్వదు. ఈ పిల్లలు మెరిట్‌లోనే సెలెక్ట్ అయ్యారు. వాళ్ల మీదున్న నమ్మకమే గ్రూప్-1,2 అధికారులుగా చేసింది. ఎవరూ ఏమనుకున్నా వాళ్ల పక్షాన నేను నిలబడ్డాను.బాధ్యతాయుతంగా పనిచేయండి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు సేవ చేయండి"

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



### వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

- పైలెట్ ప్రాజెక్టు తరహాలో నియోజకవర్గంలో ఒకటి
- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు
- ముఖ్యమంత్రికి తెలంగాణ విద్యా విధానం నివేదిక
- అందజేసిన కమిషన్ సభ్యులు
- నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు..
- ఫీజుల నియంత్రణపై రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్ చీఫ్ సెక్రటరీ
- ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ
- విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

- కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే నిర్మాణం
- సీబీఐ విచారణ కోరినా పట్టించుకోని బీజేపీ
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి



హైదరాబాద్,ఫిబ్రవరి26(జనంసాక్షి): తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోటలతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు.కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర మిగతా 2లో..

## తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోంది

- పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి కూల్చేస్తారా?
- ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
- అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం
- కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కేటీఆర్



ఖమ్మం(జనంసాక్షి): తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయండి

- వచ్చే నెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మాణం
- మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రతి బ్లాక్ ను తిరిగి పనుల పురోగతి పరిశీలన
- రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి



హుజూర్‌నగర్(జనంసాక్షి):రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి, రూ.22,500 కోట్ల బడ్జెట్ తో పనులు వివిధ దశల్లో ఉన్నాయని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పెండింగ్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ప్రతి బ్లాకు కాలినడకన తిరుగుతూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిసిటీ, మొక్కలు నాటడం, వైట్ వాష్ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూనాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ నియో జకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత మిగతా 2లో..

## ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ
- ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన
- త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి26 (జనంసాక్షి): ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒ ప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు మిగతా 2లో..

### ఓటరు గుర్తింపు నిర్ధరణ కోసం పదో తరగతి పత్రాలనూ సమర్పించొచ్చు: సుప్రీం

2లో..

### హైదరాబాద్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో తప్పిన పెనుముప్పు

## దౌత్యచర్చలను మా బలహీనతగా చూడొద్దు

- మా హెచ్చరికలు సీరియస్‌గా తీసుకోండి
- ట్రంప్ వద్ద ఇంకా చాలా ఆప్షన్లు ఉన్నాయి
- ఇరాన్‌కు జేడీ వాన్స్ వార్నింగ్



న్యూయార్క్(జనంసాక్షి): ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాకు యుద్ధనౌకలను పంపుతూ టెహ్రాన్‌పై అగ్రరాజ్యం బెదిరింపులకు పాల్పడుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. సైనిక చర్యకు సంబంధించి తమ బెదిరింపులను ఇరాన్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వాన్స్ ఫ్యాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ.. చెత్త పాలకుల చేతుల్లో అణ్వాయుధాలు ఉండటం సరికాదంటూ ఇరాన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దౌత్య చర్చలను అమెరికా బలహీనతగా చూడొద్దంటూ హెచ్చరించారు. తమ అధ్యక్షుడు ట్రంప్ దౌత్యపరమైన మార్గాలనే ఇష్టపడతారంటూనే.. ఆయన వద్ద మిగతా 2లో..

## వలసదారుల పట్ల మీరు అనుసరిస్తున్న విధానం సరికాదు

- వారిని సంబంధంలేని దేశాలకు తరలించడమేంటి?
- ట్రంప్ విధానాలను తప్పుపట్టిన ఫెడరల్ కోర్టు



న్యూయార్క్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷-గ్గ÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన మిగతా 2లో..

## కంటెంట్‌కు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లదే బాధ్యత

### స్పష్టం చేసిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ(జనంసాక్షి): తమ వేదికపై పబ్లిష్ అయ్యే ప్రతీ కంటెంట్‌కూ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లే బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. పిల్లలు, పౌరుల ఆన్‌లైన్ భద్రత దృష్ట్యా ఇది చాలా అవసరం అని పేర్కొన్నారు. ఈ మేరకు డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ కాంక్లేవ్‌లో గురువారం ఆయన ప్రసంగించారు. ఏఐ వినియోగం, కంటెంట్ క్రియేటర్లకు చెల్లింపులు వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. ఏఐ వినియోగంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ఏ వ్యక్తి అనుమతి లేకుండా వారి ముఖం, వాయిస్, పర్సనాలిటీని మిగతా 9లో..



భారత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకున్న కెనడా అధికారులు

## కార్నీ భారత్ పర్యటన వేళ.. స్వరం మార్చిన కెనడా

ఒట్టావా(జనంసాక్షి):జస్టిన్ ట్రూడో హయాంలో ఒడుదొడుకులకు గురైన భారత్-కెనడా సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత్‌తో స్నేహానికి మొగ్గు చూపుతున్నారు. ఆయన మన దేశ పర్యటనకు రానున్నారు ఇలాంటి సమయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. మన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను కెనడా అధికారులు మిగతా 2లో..

## 'ప్రచండ్'లో గగన విహారం చేయనున్న రాష్ట్రపతి

### రాజస్థాన్‌లో వాయుసేన విన్యాసాలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్'లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం ఆధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు. ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ దీన్ని తయారుచేసింది. మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27.02.2026

## సీఎం రేవంత్‌తో హిమాచల్ మంత్రి భేటీ

హైదరాబాద్:హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.

## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు చేసిన కుట్ర

### ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద బుక్‌ను నిషేధించిన సుప్రీం

బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారాన్ని తాము సమర్థించుకోదలచ లేదని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వెల్లడించారు. ఈ విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వాళ్లు ప్రయోగించిన బుల్లెట్‌తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది. న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా ఉద్దేశపూర్వకంగా చేసిన చర్యగా కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా ఇలాగే వదిలేస్తే.. ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది" అని ఆందోళన వ్యక్తంచేశారు. "అలాగే న్యాయవ్యవస్థ పాత్ర వివరించేందుకు ఒక పూర్తి అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ కేటాయించింది. కానీ కోర్టుల విశిష్ట చరిత్రను మాత్రం వదిలేసింది. జవాబుదారీతనం విస్మరించేలా ఈ వ్యవహారాన్ని మేం వదిలివేయబోం. దీనికి వెనక ఎవరు ఉన్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం" అని వ్యాఖ్యానించారు.అలాగే ఎన్‌సీఈఆర్‌టీ వివాదాస్పద పుస్తకంపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని ఉల్లంఘిస్తే.. కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఆ సంస్థ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా తుషార్ మెహతా స్పందిస్తూ.. న్యాయవ్యవస్థకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. పబ్లిక్ నోటీస్ ద్వారా బేషరతుగా క్షమాపణలు చెప్తామని కోర్టుకు తెలియజేశారు. తదుపరి విచారణ మార్చి 11న జరగనుంది.

ఇదీ జరిగింది..

పుస్తకంలో న్యాయవ్యవస్థపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం దానిపై స్పందించిన సీజేఐ.."న్యాయవ్యవస్థకు కళంకం ఆపాదించేలా ఎవరు ప్రవర్తించినా అనుమతించను" అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించిన పాఠ్యాంశంతో కూడుకున్న పుస్తక పంపిణీని నిలిపివేయాల్సిందిగా ఎన్‌సీఈఆర్‌టీకి కేంద్ర విద్యాశాఖ ఇప్పటికే ఆదేశించింది. అసంబద్ధమైన విషయాలు పాఠ్యాంశంలో వచ్చాయని, నిర్ణయం తీసుకోవడంలో పొరపాటు వల్ల ఇలా జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అసంబద్ధమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

## ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయండి

ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, 1 ఫ్లాట్ కు రూ. 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, భూమి ఫ్లాట్ తో కలిపి 10 పది లక్షల ఖర్చు అవుతుందని ఒక్క ఫ్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు, అవసరమైతే రాత్రి, పగలు కూడ ఎక్కువ పనివారిని పెట్టి మార్చి మొదటి వారం కల్లా పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని, వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్ నగర్ లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్ నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందించడం జరుగుతుందని, ఎంపిక ప్రక్రియలో ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో తాసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు,ఈ సమావేశంలో ఎస్పీ కే నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, అర్టికల్చర్ పిడి నాగయ్య, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోంది

నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్లామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు అన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది.

# తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ..



పార్లమెంటు నుంచి దివంగత రావి నారాయణరెడ్డి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచారని అన్నారు. బూర్గుల రామకృష్ణారావు, పీవీ తెలంగాణ నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. గ్రూప్-1 పరీక్షలను నిర్వహించి నియామక పత్రాలను అందించామన్న సీఎం ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో అమ్మకుండా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అభ్యర్థుల తరఫున పోరాటం చేశామని గుర్తుచేశారు. కోర్టుల్లో వాదనలు బలంగా వినిపించామని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను కుటుంబసభ్యులుగా భావిస్తుందన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించామని, అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులనే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోందని, వారి ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని చెప్పారు. ఉద్యోగులే తమ కళ్లు, తమ ప్రతినిధులని కొనియాడారు. తాము ఎన్ని పాలసీలు చేసినా దానిని అమలులో ఉద్యోగులే చాలా ముఖ్యమన్నారు. మెకానికల్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను కలవటానికి రాలేదన్న సీఎం ఇదొక భావోద్వేగమని తెలిపారు. చిత్తశుద్ధితో పని చేసి గ్రూప్-1 అధికారులు ఐఏఎస్‌లుగా ఎంపిక కావాలని చెప్పారు. ఇందులో నుంచి కొద్దిమందే ఐఏఎస్ ఐపీఎస్?లుగా అవుతారని మీపై ఉన్న బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగులను ఉద్దేశించి మన మూలాలు, నేపథ్యం గుర్తుపెట్టుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు.ముందుగా నిరుద్యోగుల నుంచి ఉద్యోగులుగా మారిన వారందరూ ఇప్పుడు తల్లిదండ్రులను మంచిగా చూసుకోకపోతే తన ఆలోచన విఫలం అయినట్లుగానే భావిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తల్లిదండ్రులను చూసుకోకపోతే వారి జీతాల నుంచి 10 నుంచి 15 శాతం కోత విధించే పాలసీని రాబోయే అసెంబ్లీలో ప్రవేశపెడతామన్నారు. ఈ మధ్య తాను కూడా హార్వర్డ్ యూనివర్సిటిలో స్టూడెంట్‌గా వెళ్లానన్న సీఎం ఎంసీహెచ్‌ఆర్డీ హార్వర్డ్ మధ్య ఎంవోయూ చేస్తానని ప్రకటించారు. మరో ఆరు నెలల్లో హార్వర్డ్ యూనివర్సిటీ ఎంసీహెచ్‌ఆర్డీకీ రాబోతుందన్నారు. హార్వర్డ్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

## వసలదారుల పట్ల మీరు అనుసరిస్తున్న విధానం సరికాదు

సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బీఆర్ఎస్

సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు.

## వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని సీఎం ఆదేశించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సీఎం పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని సీఎం ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని సీఎం తెలిపారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.కృత్రిమ మేధ ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏఐతో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకొని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని సీఎం పేర్కొన్నారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బ్రేక్ ఫాస్ట్ అందజేతకు సంబంధించి అధికారులు, హరేకృష్ణమిషన్ ప్రతినిధులకు సీఎం పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలని.. ఇందుకు పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలని అందులో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలని సీఎం తెలిపారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో ఏఐ ఆధారిత కోర్సులు వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలం చెల్లిన కోర్సులను తొలగించాలన్నారు. పాలిటెక్నిక్, ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. మిగతా యూనివర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎదుట ఉంచింది. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే ఫీజు నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచిం చారు. తెలంగాణ విద్యా విధానంపై తాము రూపొందించిన నివేదికను తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించారు. అమెరికా, వియత్నాం, మలేసియా దేశాల్లో స్వయంగా పర్యటించడంతో పాటు వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను పరిశీలించి నివేదిక రూపొందించినట్లు విద్యా కమిషన్ ఛైర్మన్, సభ్యులు సీఎంకు తెలియజేశారు.

## దౌత్యచర్చలను మా బలహీనతగా చూడొద్దు

మరిన్ని ఎంపికలు కూడా ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిని చేపట్టేందుకు ట్రంప్ సుముఖత చూపడం లేదని.. ఇరానియన్లు తమ హెచ్చరికలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. టెహ్రాన్‌తో మంచి ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని వాన్స్ అభిప్రాయ పడ్డారు. ఇక, అణు ఒప్పందానికి సంబంధించి ఇరాన్-అమెరికా మధ్య ఇప్పటికే రెండు రౌండ్లు చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గురువారం జెనీవాలో ఇరుదేశాలు మరోమారు చర్చలకు సిద్ధమయ్యాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ.. తన బృందంతో కలిసి ఇప్పటికే జెనీవాకు చేరుకున్నారు. అక్కడ ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేతృత్వంలోని అధికారులతో చర్చలు జరపనున్నారు.

## 'ప్రచండ్'లో గగన విహారం చేయనున్న రాష్ట్రపతి

2022 అక్టోబ రులో వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. ఎడారుల నుంచి పర్వతాల వరకు విభిన్న ప్రాంతాల్లో దీన్ని నడపొచ్చు. 5,000 మీటర్ల పైన ఎత్తులోనూ ఎగరగలదు. ముఖ్యంగా పర్వత ప్రాంత సరిహద్దుల వెంట మోహరింపునకు ఇది అనుకూలంగా ఉంటుంది. అధునాతన ఏవియానిక్స్, స్టెల్త్ ఫీచర్లు, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సామర్థ్యం దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్ వంటి ఆయుధాలను ప్రయోగించవచ్చు.రాష్ట్రపతి ముర్ము 2023 ఏప్రిల్‌లో అస్సాంలోని తేజ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. గతేడాది అక్టోబరులో అంబాలాలో రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని కార్వార్ తీరంలో కల్వరి శ్రేణి జలాంతర్గామి 'ఐఎన్ఎస్ వాఘ్‌షీర్'లో ప్రయాణించారు.

## కార్నీ భారత్ పర్యటన వేళ.. స్వరం మార్చిన కెనడా

వెనక్కి తీసుకున్నారు.రెండేళ్ల క్రితం.. కెనడా ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయంటూ అక్కడి విపక్షాలు ఆరోపించాయి. దాంతో అప్పటి ట్రూడో ప్రభుత్వం ఒక స్వతంత్ర కమిషన్ ఏర్పాటుచేసింది. ఆ క్రమంలో జరిగిన దర్యాప్తులో భారత్ పేరును చేరుస్తూ కెనడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో రెండు దేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అయితే ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తేల్చి చెప్పింది. అది జరిగిన కొన్ని రోజులకే ట్రూడో ఎత్తులకు షాక్ తగిలింది. కెనడా రాజకీయాల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైంది. 2021 నాటి ఎన్నికలను ప్రభావితం చేసేలా న్యూదిల్లీ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని కెనడాలో ఎన్నికలను పర్యవేక్షించిన ఓ సీనియర్ అధికారి కమిషన్‌కు వెల్లడించారు. ఇప్పుడు ఆ ఎన్నికల జోక్యం అంశం పైనే కార్నీ ప్రభుత్వం స్పందించింది తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో భారత్ జోక్యాన్ని తాము విశ్వసించడం లేదని కెనడా అధికారి వెల్లడించారు.

# జీఏడీ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా

కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

## ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఃూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

## ఓటరు గుర్తింపు నిర్ధరణ కోసం పదో తరగతి పత్రాలనూ సమర్పించొచ్చు

న్యూఢిల్లీ (జనంసాక్షి): అర్హులైన ఓటర్లుగా నిరూపించుకోవడానికి ప్రజలు పదో తరగతి ప్రవేశ (అడ్మిట్) కార్డు, ఉత్తీర్ణత ధ్రువీకరణనూ అనుబంధ పత్రంగా ఎన్నికల అధికారులకు సమర్పించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుకు సంబంధించి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వు ఇచ్చింది. ఓటరు నమోదు అభ్యర్థనల్లో సహేతుక వ్యత్యాసాలు, తల్లిదండ్రుల పేర్లపై అభ్యంతరాలకు సంబంధించి వచ్చిన 80లక్షల క్లెయిమ్‌ల పరిష్కారానికి బెంగాల్‌లోని జిల్లా, సబార్డినేట్ జడ్జీలను కేటాయించాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ధర్మాసనం ఇది వరకే సూచించింది. అయితే, బెంగాల్‌లోని 250 మంది జిల్లా, సబార్డినేట్ జడ్జీలు సరిపోరని తెలపడంతో ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాల న్యాయాధికారుల సహకారాన్నీ తీసుకోవాలని సీజేఐ ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై మరింత స్పష్టతనిస్తూ పదో తరగతి పత్రాలను ఓటర్ల గుర్తింపు నిర్ధరణకు అనుబంధ పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవచ్చని బుధవారం వివరించింది. గురువారం సాయంత్రం 5 గంటల్లోగా వాటిని ఎన్నికల అధికారులకు అందజేయాలని పేర్కొంది. బెంగాల్‌లో సర్ కసరత్తు ఈ నెల 28వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చింది.

## హైదరాబాద్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో తప్పిన పెనుముప్పు

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పింది. ఈ విషయంపై హైదరాబాద్ డిస్టిక్ట్ ఫైర్ ఆఫీసర్ రాందాస్ మాట్లాడారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఇంకా నిర్ధారణకు రాలేదని చెప్పుకొచ్చారు. బిల్డింగ్ లోపల రెన్యువేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.ప్రమాద సమయంలో షాపులో సిబ్బంది ఎవరూ లేరని స్పష్టం చేశారు. రెన్యువేషన్ పనులు జరుగుతుండటంతో మెటీరియల్స్ వేరే ప్రాంతానికి తరలించారని తెలిపారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..?, లేక వెల్డింగ్ పనుల జరిగిందా.. అనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉందని అన్నారు. ఈ ఘటన సమయంలో ఐదుగురు మాత్రమే షాపులో ఉన్నారని.. అంతా సురక్షితంగా బయటపడ్డారని పేర్కొన్నారు. షాపులో మెటీరియల్ లేకపోవడంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉందని చెప్పారు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు. వేసవి సమీపించింది కాబట్టి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. షాపుల్లో ఫైర్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాందాస్ ఆదేశించారు.



# దళిత బిడ్డ కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలి

- లాకప్ మరణానికి కారకులైన డీఎస్పీ, సిఐ,ఎస్ఐ ముగ్గురిని డిస్మిస్ చేయాలి
- పార్టీ పక్షాన ఐదు లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తాం
- మరియమ్మ లాకప్ డెత్ కేసులో బాధిత కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలబడింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కోదాడ, ఫిబ్రవరి 26( జనం సాక్షి):** కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరగకపోతే జాతీయస్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చేపడతామని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కోదాడ పట్టణంలో ఇటీవల లాకప్ డెత్ లో మృతి చెందిన కర్ల రాజేష్ కుటుంబాన్ని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, గాదారి కిషోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లతో కలిసి తల్లి లలితమ్మను పరామర్శించారు. రాజేష్ మృతికి కారకులైన పోలీసు యంత్రాంగంపై చర్యలు తీసుకోకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిని ఎందుకు కాపాడుతున్నారో జవాబు చెప్పాలన్నారు. దుర్మార్గానికి ఒడిగట్టిన డిఎస్పి, సిఐ,ఎస్ఐ లను విధుల నుండి సస్పెండ్ చేయాలన్నారు. డీఎస్పీపై చర్యలు తీసుకోకుండా స్థానిక మంత్రి సివిల్ సప్లై శాఖలో పదోన్నతి కల్పించడం వెనకాల ఆంతర్యం ఏమిటి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో లాక్ అప్ డెత్ లో మృతి చెందిన మరియమ్మ కేసులో పూర్తి న్యాయం చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాజేష్ కుటుంబాన్ని తీవ్ర అన్యాయానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పక్షాన బాధిత కుటుంబానికి ఐదు లక్షల సహాయాన్ని ప్రకటించారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ కర్ల రాజేష్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజేష్ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగప్రజా సంఘాలకు వివిధ రాజకీయ పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాజేష్ తల్లితో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా కేటీఆర్ ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై చోరీలు

- నిందితుని అరెస్టు
- నిందితుడి నుండి 14.4 గ్రాముల బంగారం, 14 తులాల వెండి స్వాధీనం




**మంచిర్యాల , ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మద్యం బానిసై, జల్సాల కోసం చోరీలకు పాల్పడిన దొంగను మందమర్రి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి 14.4 గ్రాముల బంగారం, 14 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి. నరేష్ తెలిపారు.ఎస్సై జి. నరేష్ కథను మేరకు మంచిర్యాల జిల్లా మందమర్రి యాపల్‌కు చెందిన జాడి అభిరామ్ (21) కూలి పనులు చేస్తూ జీవించేవాడని, అయితే, అతడికి ఉన్న మద్యపానం అలవాటు, విలాసవంతమైన జీవితం గడపాలనే కోరికతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో జనవరి 30వ తేదీన తన ఇంటి పక్కనే నివసించే సెగ్గం మధు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో ఉన్న 12.5 గ్రాముల బంగారం నగదును దోచుకున్నాడు. అంతటితో ఆగకుండా, అదే రోజు పక్కనే ఉన్న దుర్గం నాగలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించి 08 గ్రాముల బంగారం నగదు చోరీ చేశాడు. దొరికిన రూ. 25,000 నగదుతో నేరుగా గోవాకు వెళ్లి అక్కడ విచ్చలవిడిగా జల్సాలు చేశాడు.

పట్టుబడింది ఇలా గోవాలో డబ్బులు అయిపోవడంతో, మిగిలిన బంగారాన్ని అమ్మి మళ్లీ జల్సాలు చేయాలని భావించిన అభిరామ్ తిరిగి మందమర్రి చేరుకున్నాడు. గురువారం బంగారం అమ్మేందుకు వెళు_న్నాడన్న ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. మందమర్రిలోని సిఇఆర్ క్లబ్ వద్ద ఎస్సై తన బృందంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు లక్ష రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



# బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి

**ములుగు బ్యూరో,ఫిబ్రవరి26(జనం సాక్షి):** బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి అన్నారు.గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాంకర్లు ముందుకు సాగాలన్నారు.గ్రామాలలోని నిరుపేద కుటుంబాలకు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి ఎదుగుదలకు గాను సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బ్యాంకర్లకు సూచించారు. నూతనంగా ఏర్పడే మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించడానికి వారికి నూతన ఖాతాలను తెరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 60 సంవత్సరాలు నిండిన మహిళ వయోవృద్ధులతో ఏర్పాటు చేస్తున్న సంఘాలకు నూతన ఖాతాలు అందించడం వారికి అనుగుణంగా రుణ సహాయాలు అందించడానికి బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు.నిరుద్యోగ యువత స్వయం ఉపాధి మరియు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వ పథకాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి నియమ నిబంధనల ప్రకారం రుణాలు అందించే విధంగా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్,లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్,నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్బిఐ ఏజీఎం యశ్వంత్ సాయి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కమలాకర్ లతో కలిసి 2026-27 ఆర్థిక సంవత్సర ప్రొటెక్షన్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ధర్మ నాయక్, మత్స సంవర్ధక శాఖ సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, అడిషనల్ డిఆర్డిఏ శ్రీనివాస్,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాల కు అన్ని ఏర్పాట్లు చేయాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):** ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే విధంగా సిద్ధం చేయాలని, జిల్లా లో వివిధ శాఖల లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క సారలమ్మ వన దేవతలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,ఎస్పి సుధీర్ రామ్ నాథ్ కేకన్,ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా లతో కలిసి మేడారం లోని హరిత హోటల్ లో మేడారం మాస్టర్ ప్లాన్, జంపన్న వాగు అభివృద్ధి పనులు,ఇందిరమ్మ నిర్మాణం, గోదావరి పుష్కరాల నిర్వహణ, వేసవికాలంలో త్రాగునీటి సరఫరా, సెంట్రల్ లైటింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు,పలు అభివృద్ధి పనులపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని అన్నారు. అదే విదంగా పూర్తయిన ఇండ్లకు డబ్బులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మేడారంలో మరిన్ని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని, భక్తులకు ప్రశాంతమైన దర్శనం కల్పించే విధంగా గద్దెల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని,ఆదివాసి పూజారులతో సమావేశాలు నిర్వహించి వారి సూచన సలహాలు మేరకు పటిష్టమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, మేడారం రహదారుల డివైడర్ మధ్య భాగంలో ప్లాంటేషన్ చేయాలని అన్నారు. జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించేలా చూడడం కోసం జంపన్న వాగుపై చెక్ డ్యామ్ ల నిర్మాణం కోసం నిపుణులతో సర్వే నిర్వహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో పెండింగ్ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నం కావాలని వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పలు అంశాలు అన్ని సిద్ధం చేసుకోవాలని ఈ మూడు నెలలు వేసవి కాలంలో త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ప్రభుత్వ నిధులను పకడ్బందీగా ప్రజల అభివృద్ధి కోసం వెచ్చించాలని, ములుగు జిల్లా కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించే విధంగా అభివృద్ధి పరచాలని అన్నారు.వచ్చే ఏడాది 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్ ల వద్ద ప్రజల సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ వంటి వాటికి అవసరమైన మేర మరమ్మతులు చేయించాలని అన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని మంత్రి ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలో నాలుగు పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు పకడ్బందీ ప్రణాళికలతో ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందించే విధంగా చూడాలని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ లో కూలీల సంఖ్య పెరిగే విధంగా చూడాలని ఈ పథకం ద్వారా గ్రామానికి అవసరం అయ్యే పనులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ సునీత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు,ఆర్డీఓ వెంకటేష్,సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# జేసీఐ హైదరాబాద్ ఛాంపియన్స్ 2026 అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథిగా పీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని హోటల్ ఎలైచీ కేఫేలో జేసీఐ హైదరాబాద్ ఛాంపియన్స్ సంస్థ ప్రతిష్టాత్మక ఇన్‌స్టాలేషన్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ జేసీ కిశోర్ కుమార్ 2026 సంవత్సరానికి అధ్యక్షుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు మరియు డైరెక్టర్లు కూడా తమ బాధ్యతలను చేపట్టి సంస్థను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా పీసీసీ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్త, అతిథిగా విచ్చేసిన జోన్ ప్రెసిడెంట్ గౌతమ్ కుమార్ జైన్, జేసీఐ నేషనల్ బిజినెస్ డైరెక్టర్ చతుర్వేది వుటూకూరు హాజరై నూతన అధ్యక్షుడిని, వారి బృందాన్ని అభినందించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ నాయకత్వ వికాసం, యువత సాధికారత, సమాజ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు , ఉచిత ట్రైనింగ్లు, సమాజ సేవ, పబ్లిక్ స్పీకింగ్, బిజినెస్, నెట్వర్కింగ్ ట్రైనింగ్, అన్నదానం, సమాజ సేవలో జేసీఐ చేస్తున్న సేవలను ప్రశంసించారు. కోవిడ్ సమయంలో ఉప్పల ఫౌండేషన్ నుండి 2 లక్షల మందికి అన్నదానం నిర్వహణ, నిరుపేదల పెళ్లిళ్లకు పుస్తే మెట్టెలు మరియు పేదలకు చేస్తున్నటువంటి సేవలను గుర్తుచేశారు. ఇట్టి సేవా కార్యక్రమాలకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. అదేవిధంగా యువత కోసం డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని దానికోసం ఎప్పుడూ అండగా ఉంటానని సూచించారు. కార్యక్రమం ఓటు ఆఫ్ థ్యాంక్స్‌తో ముగిసి, సభ్యుల స్నేహపూర్వక సమావేశంతో విజయవంతంగా పూర్తయింది.

# మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు



**మహబూ బాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):** డాక్టర్ స్నేహ శబరిష్ గురువారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు క్రిష్ణవేణి, గణేష్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు నూతన కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**జయశంకర్ భూపా లపల్లి బ్యూరో, (జనం సాక్షి):** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలోని యాదవ కాలనీకి చెందిన సురిమిండ్ల నయన్ (29) అనే యువకుడు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక బాధ్యత

- ఎండాకాలంలో తాగు నీరు కొరత లేకుండా చూడాలి
- మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్



**గూడూరు,ఫిబ్రవరి26 (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ ల బాధ్యతే కీలకమని మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. గురువారం గూడూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సర్పంచ్ లతో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరైనారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, సర్పంచ్ లు గ్రామాల్లో నిత్యం తిరుగుతూ ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని,గ్రామాలు అభివృద్ధి కావాలంటే సర్పంచ్ లు అనునిత్యం గ్రామాల్లో తిరుగుతూ, ప్రజల మధ్య ఉంటేనే వారి సమస్యలు తెలుస్తాయని, వారి సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని,నూతన సర్పంచ్ లు స్థానిక వార్డు మెంబర్లతో అనుకూలంగా ఉంటూ గ్రామాలలోని అన్ని వార్డులలో సమస్యలపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలనీ, గ్రామాలలో సమస్య పరిస్కారం కాకపోతే స్థానిక ఎంపీడీఓ ను కలసి పరిష్కరించుకోవాలని సూచించారు.నూతన సర్పంచ్ లు గ్రామ పంచాయతీలో ఏ ఏ పనులు చేయాలో ముందుగా తెలుసుకోవాలని సలహాలు సూచనలు చేశారు. ఎండాకాలం సమిపిస్తున్నందున అన్ని గ్రామ పంచాయతీలలో నీటి సమస్య తలెత్తకుండా, వచ్చే నిధులను దుర్వినియోగం చేయకుండా, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలెనని తెలిపారు. 41గ్రామ పంచాయతీలలో మొదటి విడితలో వచ్చిన ఇందిరమ్మ ఇండ్లను సర్పంచ్ లు, అధికారులు బాధ్యతను తీసుకొని పూర్తి చేయించాలని,పెండింగ్ లో ఉన్న 133ఇందిరమ్మ ఇండ్లను ఈనెల లోపు పూర్తిగా కన్స్ట్రక్షన్ చేసే విధంగా చూడాలని కోరారు. అనంతరం గూడూరు మండలంలోని 41 గ్రామపంచాయతీలలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 76మందికి ఎమ్మెల్యే మురళి నాయక్ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ ఎమ్మార్వో నాగ భవాని, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎండి అబ్దుల్ మాలిక్, సర్పంచులు, కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు

# వరుస గృహ దొంగతనాల కేసులు చేధన

- నలుగురు నిందితుల అరెస్ట్ ఆభరణాల స్వాధీనం
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(జనంసాక్షి):** కాగజ్‌నగర్ పట్టణం లో ఇటీవల జరిగిన వరుస దొంగతనం కేసులను టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్, బుధవారం కాగజ్ నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన పత్రిక సమావేశం నందు వివరించారు. పూర్తి సమాచారం ప్రకారం జనవరి 5న కాగజ్‌నగర్ పట్టణం సిర్పిల్క్ కాలనీకి చెందిన దండే మంగా, జనవరి 3న తన ఇంటికి తాళం వేసి హైదరాబాద్కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి 7 తులాల బంగారు ఆభరణాలు, 1 కిలో వెండి వస్తువులు, సుమారు రూ.2,75,000 విలువైన ఆస్తిని అపహరించింది. బీఎన్ఎస్ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడమైనది అని అన్నారు. 07/2026 యూ/సెక్షన్ 331(4), 305(ఏ) దర్యాప్తు సందర్భంగా గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు విశ్వసనీయ సమాచారంపై కాగజ్‌నగర్ పట్టనం సుభాష్‌చంద్రబోస్ కాలనీకి చెందిన జేసీబీ డ్రైవర్ ఏ 1 - ఇర్షాద్ పాషాలిని అదుపులోకి తీసుకొని విచారించగా, తన సహచరులతో కలిసి ఈ నేరాన్ని చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని సహచరులు సిర్పిల్స్ కాలనీకి చెందిన సెంట్రింగ్ వర్కర్ అయిన ఏ2 - షైక్ అంజద్,

కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన మరో జేసీబీ డ్రైవర్ ఏ3 - మిర్జా సోహైల్ బేగ్‌లుగా గుర్తించారు. విచారణలో నిందితులు కలిసి ఒక గుంపుగా ఏర్పడి, సిర్సిల్క్ కాలనీ, కాగజ్‌నగర్ టౌన్ పరిసర ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గృహ భేధన, దొంగతనాలు చేస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొన్నేళ్లుగా నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. ప్రస్తుత కేసుతో పాటు కాగజ్నగర్ టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన మరో ఆరు ఆస్తి నేరాలలో కూడా తమ ప్రమేయం ఉన్నట్లు అంగీకరించారు. నిందితులు అపహరించిన బంగారం, వెండి ఆభరణాలను రిసీవర్లకు విక్రయించినట్లు వెల్లడించగా,

కాగజ్‌నగర్ పట్టనం బాలాజీ నగర్‌కు చెందిన గోల్డ్‌స్మిత్ ఏ4 - చిలుకూరి శ్రీకాంతను అదుపులోకి తీసుకొని విచారించగా, అపహరించిన ఆభరణాలను స్వీకరించి లాభం కోసం ఇతరులకు బదిలీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితులు ఏ1 నుండి ఏ4 వరకు అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరు పరచడమైనది. అపహరించిన ఆస్తిని చట్టబద్ధమైన పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో బలమైన తాళాలు అమర్చుకోవడం, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మరింత దర్యాప్తు కొనసాగుచున్నదని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సమావేశం లో కాగజ్ నగర్ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 ఫిబ్రవరి 2026

# మెక్సికో నార్కో రాజు మరణం

## ముగిసిన అధ్యాయమా, మొదలైన అంతమా?

మెక్సికోలోని పశ్చిమ ప్రాంతంలో 2026 ఫిబ్రవరి 22న జరిగిన ఒక తెల్లవారుజామున దాడిలో, దేశంలోనే అత్యంత శక్తివంతమైన డ్రగ్ మాఫియా డాన్, నెమేసియో ఒసెగేరా సెర్వాంటెస్ అలియాస్ "ఎల్ మంచో" చంపబడ్డాడు. అత్యంత కిరాతకంగా పేరుపొందిన జలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ (సిజెఎన్జి)కి అధినేత అయిన ఈయన మరణం మెక్సికో మాదకద్రవ్య యుద్ధంలో ఒక ముఖ్యమైన మలుపుగా పరిగణించ బడుతోంది. అయితే ఈ ఘటన నిజంగా ప్రభుత్వ విజయమా, లేక మరింత హింసాకాండకు నాందినా అనేది పెద్ద ప్రశ్న.

**ఎవరీ... 'ఎల్ మంచో'?**

మెక్సికో మాదకద్రవ్య చరిత్రలో "ఎల్ మంచో" ఒక ప్రత్యేక అధ్యాయం. అతను క్రమంగా ఎదిగిన సామాన్యుడు. 1990లలో అమెరికాలో జైలు శిక్ష అనుభవించి, 1997లో మెక్సికోకు బహిష్కరించబడ్డాడు. అక్కడ మొదట మిలేనియో కార్టెల్లో చేరి, 2010 నాటికి సొంతంగా సిజెఎన్జిని స్థాపించాడు. ఇది సినలోవా కార్టెల్ వంటి పెద్ద సంస్థల విచ్ఛిన్నం నుండి జన్మించింది.
సిజెఎన్జి అనేది కేవలం డ్రగ్స్ రవాణాకే పరిమితం కాలేదు. ఎక్స్టార్షన్, పెట్రోల్ దొంగతనం, వలసదారుల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ మైనింగ్ వంటి వైవిధ్యమైన ఆదాయ మార్గాలను కలిగి ఉంది. ఇది ఒక బహుళజాతి కార్పొరేషన్ లాగా, "సెమీ-ఫెడరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ఫ్రాంఛైజీస్"తో నిర్మించబడింది. అంటే, ఎల్ మంచో ఒక్కడిపై మొత్తం సంస్థ ఆధారపడి లేదు. ఇది ప్రాంతీయ కమాండర్లు, లాజిస్టిక్స్ పై , ఇతర ప్రత్యేక దళాలతో కూడిన ఒక దృఢమైన నిర్మాణం. ఈ నిర్మాణమే అతని మరణానంతరం కార్టెల్ తీవ్రవాద దాడులకు పాల్పడటానికి కారణమైంది.

**ప్రతీకారం: ఒక క్రమబద్ధమైన అరాచకం:**

ఎల్ మంచో మరణ వార్త అధికారికంగా ప్రకటించకముందే, దేశవ్యాప్తంగా హింసాకాండ చెలరేగింది. జలిస్కో, మిచోకాన్, గ్వానాజువాటో వంటి రాష్ట్రాల్లో కాలిపోతున్న ట్రక్కులు, ఎక్కడెక్కడో మంటలు, ముసుగు ధారుల ఆక్రమణ - ఇది అస్తవ్యస్తమైన హింస కాదు, అదొక "కొరియోగ్రాఫ్డ్" ప్రతీకారం. సుమారు 20 రాష్ట్రాల్లో 200కు పైగా నార్కో-బ్లాక్డేలు ఏర్పాటు చేయబడ్డాయి. గ్వాడలజారా అంతర్జాతీయ విమానాశ్రయంపై దాడి, ప్యూర్టో వల్లర్టా వంటి పర్యాటక కేంద్రాల్లో బస్సులు, ఎయిర్లైన్స్ రద్దు, బ్యాంకులు, సూపర్మార్కెట్లకు నిప్పంటించడం జరిగింది. ఈ దాడుల్లో 25 మంది నేషనల్ గార్డు సభ్యులు సహా కనీసం 73 మంది మరణించారు. ఇది కార్టెల్ ఇంకా పూర్తిగా చెల్లాచె దురు కాలేదని, ఒక కేంద్ర ఆదేశంతో పనిచేస్తోందని రుజువు చేస్తుంది.

**చరిత్ర పునరావృతం -"కింగ్పిన్ స్ట్రాటజీ" వైఫల్యం:**

ఎల్ మంచో మరణం తర్వాత చెలరేగిన హింస కొత్తేమీ కాదు. ఇది మెక్సికో మాదకద్రవ్య యుద్ధ చరిత్రలో పదే పదే పునరావృతమవుతున్న ఒక "స్క్రిప్ట్". 2006లో అప్పటి ప్రెసిడెంట్ ఫెలిపే కాల్డెరోన్ ప్రారంభించిన "కింగ్పిన్ స్ట్రాటజీ" (నాయకులను టార్గెట్ చేయడం) వల్ల 37 మంది ప్రధాన నాయకులలో 25 మంది చంపేశారు లేదా కొందరిని అరెస్టు చేశారు. కానీ అదే సమయంలో హత్యల సంఖ్య 1,20,000 దాటింది.
ఈ వ్యూహం హింసను అంతం చేయడమే కాకుండా, దానికి కారణమవుతుంది. ఎందుకంటే ఒక పెద్ద నాయకుడు పోయినప్పుడు, ఆ ఖాళీని భర్తీ చేసుకోవడానికి చిన్న చిన్న గ్రూపులు ఘర్షణ పడతాయి. ఆశ్చర్యకరంగా, నేటి సిజెఎన్జి కూడా ఇదే విధంగా పుట్టింది. 2010లో ఒక



పెద్ద డ్రగ్ లార్డ్ ఇగ్నాసియో కొరోనెల్ చంపబడిన తర్వాత అతని సంస్థ విచ్ఛిన్నమై, అందులోంచే సిజెఎన్జి ఒక శక్తిగా ఎదిగింది. ఇప్పుడు ఎల్ మంచో చంపబడటం వల్ల సిజెఎన్జి కూడా అదే మార్గంలో నడవడానికి అవకాశం ఉంది.

**శాంతి భద్రతల సమస్య- ప్రభుత్వ చర్యలు:**

ప్రెసిడెంట్ క్లాడియా షీన్బామ్ ప్రభుత్వం ఈ ఆపరేషన్ ద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని చూస్తోంది: "రాష్ట్రం తన అధికారాన్ని వదులుకోదు". మాజీ ప్రెసిడెంట్ లోపెజ్ ఒబ్రాడోర్ యొక్క "అబ్రాజోస్, నో బాలాజోస్" విధానానికి ఇది పూర్తి విరుద్ధం. ఎల్ మంచోను ట్రాక్ చేయడానికి అతని ప్రియురాలి సమాచారాన్ని ఉపయోగించడం, అమెరికా ఇంటెలిజెన్స్ తో సమన్వయం చేసుకోవడం కొత్త వ్యూహానికి నిదర్శనంగా కనిపిస్తోంది. అయితే ఈ విధానం ఎంతవరకు విజయవంతమవుతుందనేది ప్రశ్నార్థకం. ఎందుకంటే సైన్యం, నేషనల్ గార్డుపై ఆధారపడటం అనేది మునుపటి ప్రభుత్వాల వైఫల్య వ్యూహాన్నే పునరావృతం చేస్తుంది. దీర్ఘకాలికంగా పోలీస్, న్యాయ వ్యవస్థలను బలోపేతం చేయకపోతే, ఈ "టెక్నోక్రాటిక్" విధానం కూడా ఒక మెరుగుపెట్టిన వైఫల్యంగా మారే ప్రమాదం ఉంది.
ఎల్ మంచో మరణం మెక్సికోకు ఒక క్లిష్టమైన సమయంలో జరిగింది. 2026 ప్రపంచ కప్ ఫుట్ బాల్ ఆతిథ్యం ఇవ్వనున్న దేశానికి ఇది పెద్ద సవాలు. ప్రభుత్వం ఇప్పుడు ఒక వైపు కార్టెల్ ప్రతీకారాన్ని ఎదుర్కోవాలి, మరోవైపు అంతర్జాతీయ వేదికపై తన ఇమేజ్ ను కాపాడుకోవాలి.

**మరో "చాప్టర్" ముగిసింది, పుస్తకం మిగిలే ఉంది:**

"కింగ్ ఇజ్ డెడ్. లాంగ్ లివ్ ది కింగ్" అన్న సామెత మెక్సికో డ్రగ్ యుద్ధానికి సరిగ్గా సరిపోతుంది. ఎల్ మంచో లాంటి ఒక నాయకుడు పోవడం, ఆ స్థానాన్ని భర్తీ చేసుకోవడానికి మరింత హింసకు దారి తీస్తుంది. ఈ దాడి సిజెఎన్జిని పూర్తిగా నాశనం చేయలేదు, బదులుగా దానిని మరింత చిన్న, ప్రమాదకరమైన ముక్కలుగా చీల్చివేసే అవకాశం ఉంది. ఈ ముక్కలు తమ ఆధిపత్యం కోసం పోరాడుతూ, సామాన్య ప్రజల జీవితాలను నరకంగా మార్చే ప్రమాదం ఉంది. ఇది ఒక దుర్మార్గపు చక్రం. ప్రతిసారీ ఒక తల నరికిన ప్రతిసారీ, రెండు కొత్త తలలు మొలకెత్తుతున్నాయి. ఈ చక్రాన్ని విచ్ఛిన్నం చేయాలంటే, కేవలం సైనిక చర్యలు సరిపోవు. దీనికి లోతైన సంస్కరణలు, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సహకారం అవసరం. ఎల్ మంచో మరణం మెక్సికో చరిత్రలో ఒక అధ్యాయం ముగింపు మాత్రమే.
కథ ఇంకా మిగిలే ఉంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## శ్రుతులు

◆ శంకరాచార్యులైనా!
అన్నమాచార్యులైనా!
ఏ ఆచార్యులైనా!
ఏం చెప్పారు?

◆ అంతా మిథ్య
అన్న వేదాంతం!
పేదల చైతన్యం పై
నీళ్లు చల్లింది!

◆ కార్పొరేట్లు
ఈలోకాన్ని దోచేస్తారు!
వేదాంతులు ఈజనాన్ని
పరలోకం పొమ్మంటారు!

◆ గోవిందంభజే
మూఢ మతే!
వారి ఆకలిసంగతి
ఏంటి శంకరన్నా?

◆ అర్థమనర్థం
మంటారు మీరు!
అర్థమే సర్వస్వం
అంటారు కార్పొరేట్లు!

◆ వేదాంతులమాటలు
అదానీ అంబానీలు
గుజరాత్ దొంగలు
ఒక్కడూ వినలేదు!

◆ పిడికెడుమెతుకులు
పెట్టలేని లోకంలో
కూలినాలి జనానికి
వేదాంతమెందుకు?

◆ నాన్ రొట్టెలమ్మే
గోవిందమ్మకు
గోవింద భజన
కూడు పెడుతుందా?

◆ బఠానీలు అమ్మే
బసవయ్య
భజనలు చేసి
పిల్లల్ని పెంచగలడా?

◆ ఆచార్యులారా!
మీమెట్టవేదాంతాలు
ధనికులకు వినిపించి
పేదల్ని బతకనీయండి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# మై డియర్ స్టూడెంట్స్!!





గుడ్ మార్నింగ్!! మావోయిస్టు సుప్రిం నాయకుడు ముప్పాల లక్ష్మణ రావు/ గణపతి గారిని తెలంగాణ రాష్ట్ర అతిథిగా గౌరవించాలని నిర్ణయించడం సంతోషకరం. తద్వారా దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజల హృదయాలలో సంతోం నింపారు. అంతర్జాతీయంగా ప్రతిష్ట పెంచుకున్నారు. రాహుల్ గాంధీ రాజకీయ పరిణతికి ఇది నిదర్శనం. ఒక మహానాయకుడిని ఎలా గౌరవిస్తారో ప్రపంచ చరిత్రలో అనేక దృష్టాంతాలున్నాయి. డా. మర్రి చెన్నారెడ్డి 1989 లో ప్రదర్శించిన గౌరవం గుర్తు చేసుకోవాలి. కొండపల్లి సీతారామయ్యగారిని ఉద్యమకాలను అపారంగా గౌరవిస్తూ బహిరంగ జీవితంలోకి అనేక ప్రకటనలు చేసారు. ఆ ప్రకటనతోనే నేను గద్దర్ సంజీవ్ బహింగ జీవితంలోకి వచ్చాము. వరవరరావు జైలు నుండి విడుదలయ్యారు. తిరిగి ఉద్యమాలు ఉవ్వెత్తున సాగాయి . తెలంగాణ ముఖ్యమంత్రి పోయి ఆంధ్ర ముఖ్యమంత్రిగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నిర్బంధాలు ఎన్కౌంటర్లు.
ఇపుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి మార్గంలో అంతకు మించిన పరిణతి సాధించారు. గద్దర్, అందెశ్రీ అంతిమయాత్రలో చివరిదాకా వెంట నడిచిన రేవంత్ రెడ్డి ప్రత్యేక వ్యక్తిత్వం ఇదివరకే స్పష్టమైంది. గణపతిని రాష్ట్ర అధికార అతిథిగా గౌరవించాలని నిర్ణయించడం కోట్లాదిమంది గొప్ప ఊరట. ప్రజల ఉద్యమాలను, త్యాగాలను గౌరవించే సంప్రదాయాన్ని రేవంత్ తిరిగి నిలబెట్టారు. 1956లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును పుచ్చల పల్లి సుందరయ్య, ఆంధ్రా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు.
1969లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలి. కాలేదు. నక్సలైట్ ఉద్యమానికి ఆనాడు రాష్ట్రం ఏర్పాటు చేయక పోవడం కారణం. ఆంధ్ర కాంగ్రెస్, టీడీపీ నాయకులు ప్రతిసారీ అడ్డుకున్నారు. 1969 జై తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగింది. సమైక్య రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావు, ఆంధ్రా పాలకులు తెలంగాణ ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచారు. ఇందిరాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించడానికి హుటాహుటిన హైదరాబాద్ వచ్చినప్పుడు కాసు బ్రహ్మానందరెడ్డి తదితరులు అడ్డు కున్నారు. పాకిస్తాన్ తో యుద్ధంతో బంగ్లాదేశ్ అనే దేశాన్నే ఏర్పరచిన ఇందిరాగాంధీకి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం ఒక లెక్క కాదు. . కాంగ్రెస్ చీలి పోయి తనకు తాను నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న ఇందిరాగాంధీ ప్రభుత్వం సంక్షోభంలో పడుతుందని బెదిరించి బ్లాక్ మెయిల్ చేయడం తో ప్రధాని ఇందిరాగాంధీ అర్ధరాత్రి వచ్చినట్టే వచ్చి వెనక్కి తిరిగి పోయారు. 2004-2005 లో కూడా ఇలాగే వైయస్ రాజ శేఖర్ రెడ్డి కేంద్రం రాష్ట్రం రెంటిలో తిరుగుబాటు చేస్తమని కేంద్ర ప్రభుత్వం పడిపోతుందని బెదిరించారు. అపుడు కాంగ్రెస్ యుపిఏ ప్రభుత్వాన్ని నడిపింది. అందులో 35,దాక ఆంధ్ర ప్రదేశ్ లోనివే. గత్యంతరం లేక వాయిదా వేస్తూ చివరకు పదేళ్లు ఆలస్యం గా రాష్ట్రాన్ని విభజించారు. ఇలా ఆంధ్ర నాయకుల స్వార్థం దోపిడి అణిచివేత, కేంద్ర ప్రభుత్వ సంక్షోభం ప్రతిసారీ ఎదురవడం తెలంగాణ ప్రజల దురదృష్టం. బిజేపి కి కూడా ఇదే పరిస్థితి. అపుడు వారు ఇప్పటి వలెనే టీడీపీ మద్దతుతో మనుగడ సాగిస్తున్నారు. ఇలా దేశ రాజకీయాల్లో మార్పు, ఆంధ్ర నాయకుల ద్రోహాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలకు, వలస వాద అంతర్గత దోపిడీకి, తెలంగాణ లో నక్సలైట్ ఉద్యమానికి ప్రాతిపదిక అయ్యాయి. యువత ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# సైన్స్ గెలిచింది సరే.. మరి మనిషి గెలిచాడా?



మనం 21వ శతాబ్దం మధ్యలో ఉన్నాం. అంగారక గ్రహం మీద కాలనీలు కట్టాలని కలలు కంటున్నాం. ఉదయం లేచింది మొదలు కృత్రిమ మేధ (AI) మన నీడలా వెంటే ఉంటోంది. జన్యు పరిశోధనలు ఆయుష్షును పెంచుతాయని ధీమా ఇస్తున్నాయి. అవును, శాస్త్రం అద్భుతాలు చేస్తోంది! కానీ, ఒక చిక్కుముడి లాంటి ప్రశ్న మనల్ని ఇంకా వెంటాడుతూనే ఉంది సైన్స్ ఇంతగా గెలిచిన వేళ ,మనిషి అంతరంగం ప్రశాంతంగా ఉందా? ల్యాబ్‌లలో అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నా, గుడి ముందర క్యూలైన్లు మాత్రం తగ్గడం లేదు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రపంచం మొత్తం జేబులోకి వచ్చేసింది కానీ, గుండెల్లో ఏదో తెలియని వెలితి. గూగుల్ దగ్గర కోటానుకోట్ల సమాధానాలు ఉన్నా యి, కానీ నేనెవరు? అసలు నా జీవిత పరమార్థం ఏమిటి? అన్న ప్రశ్నలకు మాత్రం సెర్చ్ ఇంజిన్లు సరైన జవాబు ఇవ్వలేకపోతున్నాయి. శాస్త్రం మన భౌతిక అవసరాలను తీర్చగలదేమో కానీ, మనిషిలోని అభద్రతా భావాన్ని మాత్రం తుడిచేయలేకపోతోంది. ఈ తరుణంలో స్వామి వివేకానంద ఆలోచనలు మనకు ఒక దిక్సూచిలా కనిపిస్తాయి. సైన్స్ మరియు ఆధ్యాత్మికత బద్ధశత్రువులు కావని, అవి ఒకే సత్యాన్ని వెతికే రెండు వేర్వేరు దారులని ఆయన ఏనాడో చెప్పారు. సైన్స్ మనకు ఎలా? (How) అని వివరిస్తే, ఆధ్యాత్మికత ఎందుకు? (Why) అనే లోతైన అన్వేషణ చేస్తుంది. చరిత్రను తిరగేస్తే,పాశ్చాత్య దేశాల్లో పారిశ్రామిక విప్లవం తర్వాత చార్లెస్ డార్విన్, కార్ల్ మార్క్స్, సిగ్మండ్ ఫ్రాయిడ్ వంటి మేధావులు మతాన్ని గట్టిగా ప్రశ్నించారు. మార్క్స్ మతాన్ని ప్రజల మత్తుమందు అంటే, ఫ్రాయిడ్ దాన్ని మానసిక భయాల ప్రతిబింబంగా చూశారు. మన దేశంలో కూడా పెరియార్ రామస్వామి, డా. బి.ఆర్. అంబేద్కర్ మతం పేరుతో జరిగిన కుల వివక్షను ఎండగట్టారు.కానీ, మూఢనమ్మకాలపై యుద్ధం చేసే క్రమంలో మనం అసలైన ఆధ్యాత్మికతను కూడా విస్మరించామా? హేతువాది బయటి ప్రపంచాన్ని భూతద్దంతో చూస్తే, ఆధ్యాత్మికవాది తన అంతర ప్రపంచాన్ని ధ్యానంతో అన్వేషిస్తాడు. ఒకరు టెలిస్కోప్‌తో నక్షత్రాలను లెక్కిస్తే, మరొకరు మౌనంతో మనసును చదువుతారు. ఈ రెండూ ఒకదానికొకటి వ్యతిరేకం కావాల్సిన అవసరం లేదు. మీరు దేవుణ్ణి చూశారా?వివేకానందుడు తన గురువు రామకృష్ణ పరమహంసను అడిగిన ఈ మొదటి ప్రశ్నలో ఆయనలోని హేతువాదం కనిపిస్తుంది. గుడ్డిగా నమ్మడం కాదు, అనుభవపూర్వక జ్ఞానమే అసలైన ఆధ్యాత్మికత అని ఆయన చాటి చెప్పారు. 1893 చికాగో ప్రసంగంలో ఆయన ప్రపంచానికి పరిచయం చేసింది కూడా ఇదే సమతుల్యతను. ప్రేమ, కరుణ, ఒక తల్లి మమకారం వీటిని ఏ ల్యాబ్‌లోనైనా కొలవగలమా? నిరూపించలేనంత మాత్రాన అవి లేవని చెప్పలేం కదా! సైన్స్ నేటికీ సమాధానం చెప్పలేని అతిపెద్ద రహస్యం చైతన్యం (Consciousness). దీన్నే శాస్త్రవేత్తలు హార్డ్ ప్రాబ్లం ఆఫ్ కాన్షస్నెస్ అంటున్నారు. చివరకు రోజర్ పెన్రోస్, క్రిస్టోఫ్ కోచ్ వంటి దిగ్గజాలు కూడా చైతన్యాన్ని భౌతిక సూత్రాలతో పూర్తిగా వివరించడం కష్టమని అంగీకరిస్తున్నారు. క్వాంటం ఫిజిక్స్‌లోని అబ్జర్వర్ ఎఫెక్ట్ (రాఎంవతీజవతీ జుటటవష్) కూడా ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెబుతోంది. ఒక పరిశీలకుడు ఉన్నప్పుడు కణం ప్రవర్తన మారుతుందట. ఇది వేదాంతంలోని సర్వం బ్రహ్మ (ప్రపంచం మరియు పరిశీలకుడు వేరు కాదు) అనే భావనకు దగ్గరగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా Spiritual but not Religious (మతపరమైన కట్టుబాట్లు లేని ఆధ్యాత్మికత) అనే ధోరణి పెరుగుతోంది. ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం, చాలామంది యువత ఆచారాల కంటే అనుభూతికే ప్రాధాన్యం ఇస్తున్నారు. చివరకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఔసూ) కూడా మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం వంటి అభ్యాసాలను ప్రోత్సహిస్తోంది. పెద్ద పెద్ద యూనివర్సిటీల్లో ఇప్పుడు మైండ్‌ఫుల్‌నెస్ ఒక కోర్సుగా మారింది. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఒకటి ఉంది హేతువాదం పోరాడాల్సింది ఆధ్యాత్మికతతో కాదు, మూఢనమ్మకాలతో! గుడ్డి విశ్వాసం ఎంత ప్రమాదకరమో, గుడ్డి నాస్తికత్వం కూడా అంతే మొండిది. వివేకానందుడు చూపిన మూడవ దారి ఏమిటంటే ,తర్కంతో అనుభూతిని కలపడం. ఆయన స్థాపించిన రామకృష్ణ మిషన్ చేసే సేవా కార్యక్రమాలే దీనికి నిదర్శనం. దరిద్ర నారాయణ సేవ అంటే పూజ కంటే మనిషికి చేసే సేవ మిన్న అని అర్థం. నేటి యువత ఒకవైపు లాజిక్‌ను నమ్ముతూనే, ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగాను ఆశ్రయిస్తున్నారు. ఇది వైరుధ్యం కాదు, మనిషి సహజ స్వభావం. మెదడుకు తర్కం కావాలి, మనసుకు శాంతి కావాలి.జీవితాన్ని ఒక పక్షితో పోలిస్తే,సైన్స్ ఒక రెక్క, ఆధ్యాత్మికత మరో రెక్క ఒక్క రెక్కతో పక్షి ఎగరలేదు. కేవలం సైన్స్‌తో బతికితే మనిషి ఒక యంత్రం (Robot) అవుతాడు.కేవలం తర్కం లేని ఆధ్యాత్మికతతో బతికితే అంధవిశ్వాసాల్లో కూరుకుపోతాడు. మాక్స్ ప్లాంక్ అన్నట్లు, మనం ఏ ప్రకృతిని అయితే పరిశోధిస్తున్నామో అందులో మనం కూడా భాగమే. మన జ్ఞానానికి పరిమితులు ఉన్నాయని అంగీకరించడమే నిజమైన వినయం. రేపు మనిషి అంగారకుడి మీద అడుగు పెట్టినా, ఆ విజయానికి కారణమైన శాస్త్రానికి సలామ్ చేస్తూనే,అనంత విశ్వాన్ని చూసి మౌనంగా విస్మయం చెందుతాడు. ఎందుకంటే మనిషి అంటే కేవలం మాంసపిండం కాదు,అతడొక ప్రశ్నించే తర్కం, అనుభూతి చెందే హృదయం! సైన్స్ గెలిచింది. ఇప్పుడు మనిషి గెలవాలి. తనలోని వెలితిని జయించి, తర్కాన్ని మరియు అంతరాత్మను ఒకే త్రాటిపై నడిపించినప్పుడే ఆ విజయం సంపూర్ణం.

డా .సూర్యదేవరరామకృష్ణ ,
9490754169

# శాస్త్ర విజ్ఞానంతో భవిష్యత్ భారత్ నిర్మాణం!

ఫిబ్రవరి 28న భారతదేశం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుం టుంది. 1928లో సి.వి. రామన్ ప్రకటించిన రామన్ ప్రభావాన్ని స్మరించుకోవడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని సాధించిన ఈ ఆవిష్కరణ భారతీయ శాస్త్ర ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై నిలిపింది. అయినప్ప టికీ శాస్త్ర అభివృద్ధిని కేవలం నోబెల్ పురస్కారాల ఆధారంగా కొలవడం సముచితం కాదు. శాస్త్రం ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచే సామాజిక సాధనంగా ఉండాలి.
జాతీయ సైన్స్ దినోత్సవం వంటి పదాలు శాస్త్రంపై ప్రజల ఊహల ను నిర్మిస్తాయి. ప్రపంచ స్థాయి గుర్తింపులు పొందిన ఆవిష్కరణలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుంది. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో మాతృ మరణాల తగ్గుదల వంటి విజయాలు తక్కువ చర్చకు వస్తాయి. ఈ పరిస్థితి శాస్త్రాన్ని ప్రతిష్ఠా ప్రమాణాలకే పరిమితం చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. శాస్త్రాన్ని డీకలోనైజ్ చేయడం అంటే విదేశీ గుర్తింపును ప్రధాన ప్రమాణంగా చూడే ధోరణిని తగ్గించడం. పరిశోధన కేంద్రా లు, విశ్వవిద్యాలయాలు మాత్రమే జ్ఞాన ఉత్పత్తి కేంద్రాలు కావు. రైతులు, మత్స్యకారులు, చేతివృత్తి కళాకారులు అనుభవ ఆధారిత జ్ఞానాన్ని తరతరాలుగా కొనసాగిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగు విధానాలు, సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులు శాస్త్రీయ అధ్యయనానికి అర్హమైనవే.
జుగాడ్ భావన భారతీయ సృజనాత్మకతకు ప్రతీక. తక్కువ వనరుల తో సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఇందులో కనిపిస్తుంది. దానిని తాత్కాలిక పరిష్కారంగా కాకుండా సృజనాత్మక ఆవిష్కరణల మూలంగా చూడాలి. పరిశ్రమలు, పరిశోధన సంస్థలు స్థానిక సృజనాత్మకతను ఆధునిక సాంకేతిక అభివృద్ధితో అనుసంధాని ంచాలి. పోరంబోకే అనే భావన సామాజిక న్యాయ దృష్టికోణంలో ప్రాధాన్యం కలిగినది. భూమిని ఆదాయ ఆధారంగా వర్గీకరించే పరిపాలనా విధానం ప్రజా వినియోగ భూములను విలువలేనివిగా చూపే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఆ భూములపై ఆధారపడిన సమాజాల జీవనాధారం దెబ్బతినే అవకాశం ఉంటుంది. అభివృద్ధి విధానాలు పర్యావరణ సమతుల్యత, సామాజిక న్యాయం, జీవన భద్రతలను సమగ్రంగా పరిగణించాలి. ప్రయోగశాలలు ఆధునిక జ్ఞాన ఉత్పత్తి కేంద్రాలు. అయితే పరిశోధన వ్యవస్థలో కుల, లింగ అసమానతలు కనిపించే సందర్భాలు ఉన్నాయి. సమాన అవకాశా లు కల్పించడం శాస్త్ర సమాజ బాధ్యత. శాస్త్రం మానవతా విలువల పై ఆధారపడాలి. భారతదేశంలో ఆధునిక పరిశోధన సంస్కృతికి పునాది వేసిన సంస్థలు ఉన్నాయ. భవిష్యత్తులో అవి స్థానిక అవసరాల దిశగా మరింత దృష్టి సారించాలి. మౌలిక సదుపాయా లు, నాణ్యమైన విద్య, పరిశోధన స్వేచ్ఛ శాస్త్రాభివృద్ధికి అవసరమైన అంశాలు. 2050 నాటికి కృత్రిమ మేధస్సు, జీవ సాంకేతికత, పర్యావరణ శాస్త్రం వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశముంది. అయితే సాంకేతిక పురోగతి మానవ విలువలను తగ్గించకూడదు. యంత్రాల పెరుగుదలతో పాటు మానవ శ్రమకు గౌరవం ఉండాలి. కొత్త అవకాశాలు సృష్టించే దిశగా సాంకేతికతను ఉపయోగించాలి.
శాస్త్ర విద్యను ప్రాంతీయ భాషల్లో విస్తరించడం అత్యంత అవసరం. చిన్ననాటి నుంచే ప్రయోగాత్మక ఆలోచన అలవాటు కావాలి. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశీలన, ప్రయోగం, విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతలో పరిశోధనా దృక్పథం పెంపొందాలి. పరిశోధన రంగానికి తగిన నిధులు కేటాయించాలి. మహిళా శాస్త్రవేత్తలకు సమాన అవకాశాలు కల్పించాలి. పారదర్శ కత, జవాబుదారీతనం పెంపొందాలి. శాస్త్ర రంగం సామాజిక న్యాయ దిశగా అభివృద్ధి చెందాలి. డి నోబెలైజింగ్ సైన్స్ అనేది ప్రతిష్ఠా ప్రమాణాల నుంచి విముక్తి. అంతర్జాతీయ పురస్కారాలు గౌరవప్రదమైనవే అయినప్పటికీ అవే ఏకైక ప్రమాణాలు కావు. గ్రామీణ ఆరోగ్య కార్యకర్త రూపొందించిన సరళ వైద్య పద్ధతి, స్థానిక ఇంజనీర్ తయారు చేసిన తక్కువ ఖర్చు నీటి శుద్ధి యంత్రం, గిరిజన సమాజం సంరక్షించిన ఔషధ మొక్కల జ్ఞానం కూడా సమాన గౌరవానికి అర్హాలు.
విద్యా వ్యవస్థ డీకలోనైజింగ్ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుంది.



భారతీయ శాస్త్ర చరిత్రను సమగ్రంగా బోధించాలి. ప్రశ్నించే స్వభా వం, విమర్శనాత్మక ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథం పెంపొ ందాలి. గిరిజన జ్ఞానం, గ్రామీణ సాంకేతికత, నగర పరిశోధన కేంద్రాల ఆవిష్కరణలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలి. పర్యావరణ సంక్షోభం పెరుగుతున్న ఈ కాలంలో శాస్త్రం బాధ్యత మరింత పెరిగింది. వాతావరణ మార్పు, నీటి కొరత, జీవ వైవిధ్య హ్రాసం వంటి సమస్యలకు సమగ్ర పరిష్కారాలు అవసరం. స్థానిక సమాజాల అనుభవ జ్ఞానం, బాధ్యతాయుత వినియోగ సంస్కృతి, సుస్థిర అభివృద్ధి విధానాలు కలిసి పనిచేయాలి.
సమాన అవకాశాలు కలిగిన శాస్త్ర వాతావరణం నిర్మాణం అవసరం. కులం, లింగం, ప్రాంతం ఆధారిత అడ్డంకులు తొలగాలి. పరిశోధన నిధుల పంపిణీ పారదర్శకంగా ఉండాలి. గ్రామీణ విద్యార్థులకు ప్రయోగశాల ప్రాప్తి కల్పించాలి. 2047 స్వాతంత్ర్య శతాబ్దిని లక్ష్యంగా పెట్టుకుని భారత శాస్త్రం సమాజంపై చూపిన ప్రభావంతో కొలవబడాలి. పోషకాహార లోపం తగ్గుదల, శుద్ధ జల ప్రాప్తి పెరుగుదల, పర్యావరణ పరిరక్షణ విజయాలు నిజమైన ప్రమాణాలు కావాలి. శాస్త్రం ఒక సామాజిక ఒప్పందం. సమాజం వనరులు అందిస్తుంది. ప్రతిగా శాస్త్రం పరిష్కారాలు అందించాలి. ఈ పరస్ప ర సంబంధం బలపడినప్పుడే డీకలోనైజింగ్ లక్ష్యం సాధ్యమవుతుం ది. భారతదేశం తన స్థానిక జ్ఞాన సంపద, యువశక్తి, సాంస్కృతిక వైవిధ్యాన్ని సమన్వయపరచి సమగ్ర శాస్త్ర దిశగా ముందుకు సాగాలి. అదే నిజమైన జాతీయ సైన్స్ దినోత్సవ సారాంశం.
2.ఇప్పటివరకు చర్చించిన అంశాలన్నింటిని సమగ్రంగా పరిశీలించి నప్పుడు స్పష్టమవుతుంది - శాస్త్రాన్ని డీకలోనైజ్ చేయడం అనేది కేవలం పాశ్చాత్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా చేసే ప్రతిస్పందన కాదు. అది జ్ఞాన స్వరూపంపై లోతైన పునర్విమర్శ. శాస్త్రం ఎవరిది? శాస్త్రానికి ప్రమాణాలు ఎవరు నిర్ణయిస్తారు? శాస్త్ర ప్రయోజనం ఎవరికి చేరాలి? అనే మూడు ప్రధాన ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రక్రియే డీకలోనైజింగ్ దిశ.
భారతదేశం వంటి విభిన్న సంస్కృతుల దేశంలో శాస్త్రం ఒకే రకమైన అనుభవంతో రూపుదిద్దుకోదు. గిరిజన ప్రాంతాల్లో అడవితో మమేకమైన జీవన విధానం ఒక జ్ఞాన వ్యవస్థను అందిస్తుంది. ఎండబారిన ప్రాంతాల్లో నీటి సంరక్షణ పద్ధతులు మరో జ్ఞాన ప్రవాహాన్ని సృష్టిస్తాయి. తీరప్రాంతాల్లో మత్స్యకారుల అనుభవం సముద్ర జీవవ్యవస్థపై సుదీర్ఘ అవగాహనను ఇస్తుంది. ఇవన్నీ కలిసి భారతీయ శాస్త్ర వైవిధ్యాన్ని నిర్మిస్తాయి. ఈ జ్ఞాన ప్రవాహాలను పరస్పరం అనుసంధానించకపోతే శాస్త్రం అసంపూర్ణంగా మిగులుతుంది. డి నోబెలైజింగ్ దిశలో ముందుకు సాగాలంటే పురస్కార కేంద్రీకృత మానసికత నుంచి బయటపడాలి. అంతర్జాతీయ గుర్తింపులు ప్రేరణనిచ్చే అంశాలే అయినప్పటికీ వాటిని లక్ష్యంగా పెట్టుకుని మాత్రమే పరిశోధన సాగితే స్థానిక అవసరాలు పక్కన పడే ప్రమాదం ఉంది. ఉదాహరణకు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించే సరళ సాంకేతికత అంతర్జాతీయ పురస్కారాన్ని పొందకపోవచ్చు. అయితే ఆ పరిష్కారం వేలాది కుటుంబాల ఆరోగ్యాన్ని కాపాడితే అది శాస్త్ర విజయమే.
శాస్త్రాన్ని ప్రభావంతో కొలవాలి. ప్రతిష్ఠతో కాదు.
శాస్త్ర విధాన రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి. సాధారణ పౌరుడు కూడా పరిశోధన దిశపై అభిప్రాయం చెప్పగల వాతావరణం అవసరం. గ్రామ సభలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు కలిసి శాస్త్ర చర్చలకు వేదికలు సృష్టించాలి. శాస్త్రవేత్తలు సమాజంతో నిరంతర సంభాషణ కొనసాగించాలి. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిశోధన లక్ష్యాలను నిర్ణయించాలి. ఇది శాస్త్ర ప్రజాస్వామ్యీకరణ దిశగా ఒక ముఖ్యమైన అడుగు.
ప్రాంతీయ భాషల్లో శాస్త్ర రచనలు పెరగాలి. శాస్త్రం కేవలం ఆంగ్ల భాషలోనే అందుబాటులో ఉంటే అది జ్ఞానాన్ని పరిమిత వర్గానికి మాత్రమే కట్టిపడేస్తుంది. తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ వంటి భాషల్లో పరిశోధన వ్యాసాలు, శాస్త్ర పుస్తకాలు, ప్రజా శాస్త్ర రచనలు విస్తరించాలి. భాషా వైవిధ్యం జ్ఞాన వైవిధ్యానికి బలం చేకూరుస్తుంది. ప్రాంతీయ భాషలో ఆలోచించినప్పుడు సమస్యల పరిష్కారాలు స్థానిక సందర్భానికి దగ్గరగా ఉంటాయి.
సాంకేతిక అభివృద్ధి సామాజిక అసమానతలను పెంచకూడదు. కృత్రిమ మేధస్సు, జీవ సాంకేతికత, డేటా ఆధారిత విధానాలు అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో సమాన అవకాశాలు కీలకం. గ్రామీణ విద్యార్థులు కూడా డిజిటల్ వనరులను వినియోగించగలగాలి. పరిశోధన నిధుల పంపిణీలో పారదర్శకత ఉండాలి. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక మార్గదర్శక వ్యవస్థలు అవసరం. శాస్త్ర రంగంలో ప్రతిభను వర్గం, ప్రాంతం ఆధారంగా పరిమితం చేయరాదు.
శాస్త్ర నైతికత కూడా డీకలోనైజింగ్ ప్రక్రియలో ముఖ్యమైన అంశం. పరిశోధన ఫలితాలు ఎవరి ప్రయోజనానికి ఉపయోగపడుతున్నా యి? ఔషధ పరిశోధనలు పేదలకు అందుబాటులో ఉన్నాయా? సాంకేతికత మానవ గోప్యతను కాపాడుతున్నదా? వంటి ప్రశ్నలు నిరంతరం లేవనెత్తాలి. శాస్త్రం మానవ గౌరవాన్ని కాపాడే దిశగా సాగాలి. విద్యా వ్యవస్థలో ప్రయోగాత్మక దృక్పథం పెంపొందించాలి. పాఠ్యపుస్తక జ్ఞానం మాత్రమే సరిపోదు. పరిశీలన, అనుమానం, పరీక్ష, విశ్లేషణ వంటి శాస్త్రీయ పద్ధతులను విద్యార్థులు అనుభవం ద్వారా నేర్చుకోవాలి. గ్రామీణ పాఠశాలల్లో కూడా చిన్న ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. స్థానిక సమస్యలను గుర్తించి విద్యార్థులే చిన్న పరిశోధనలు చేయగల వాతావరణం ఉండాలి. ఈ విధానం శాస్త్రాన్ని జీవన అనుభవంతో అనుసంధానిస్తుంది.
భారతదేశం 2047 స్వాతంత్ర్య శతాబ్దిని చేరుకునే సమయానికి శాస్త్ర రంగంలో నూతన దిశ అవసరం. ఆ దిశ సమాజ అవసరాల నుంచి పుట్టాలి. పోషకాహార లోపం నిర్మూలన, గ్రామీణ ఆరోగ్య సదుపాయాల విస్తరణ, శుద్ధ జల అందుబాటు, పర్యావరణ సమతుల్యత - ఇవే నిజమైన అభివృద్ధి సూచికలు కావాలి. పురస్కారాల సంఖ్య కంటే ప్రజల జీవన ప్రమాణం ముఖ్యమవాలి. శాస్త్రాన్ని డీకలోనైజ్ చేయడం అనేది అంతిమ లక్ష్యం కాదు. అది నిరంతర ప్రక్రియ. సమాజ మార్పులకు అనుగుణంగా శాస్త్ర దిశ మారాలి. కొత్త సవాళ్లు ఎదురైనప్పుడు శాస్త్రం కొత్త మార్గాలను అన్వేషించాలి. స్థానిక జ్ఞానం, ఆధునిక సాంకేతికత, సామాజిక న్యా యం, పర్యావరణ పరిరక్షణ - ఈ నాలుగు దిశలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే భారతీయ శాస్త్రం నిజమైన అర్థంలో స్వతంత్రతను సాధిస్తుంది. అంతిమంగా శాస్త్రం ఒక సామాజిక బాధ్యత. అది ప్రజల ఆశలు, అవసరాలు, భవిష్యత్తు కలలతో ముడిపడి ఉంటుంది. శాస్త్రవేత్తలు సమాజంతో మమేకమై పనిచేసినప్పుడు శాస్త్రం సజీవంగా ఉంటుంది. ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే శాస్త్ర వ్యవస్థే నిజమైన డీకలోనైజ్డ్ శాస్త్రం. అదే డి నోబెలైజ్డ్ శాస్త్ర దిశ. అదే భారత శాస్త్ర భవిష్యత్తు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# కుల వ్యతిరేక, సమానత్వపు మార్గదర్శకాలను యుజీసీ వెంటనే అమలు చేయాలి




**ముషీరాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** ఉన్నత విద్యా వ్యవస్థలో కుల వివక్ష, వెనుకబడిన సామాజిక వర్గాల పై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు యుజిసి రూపొందించిన కుల వ్యతిరేక సమానత్వపు మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా తక్షణమే అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సహాయక రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత అధ్యక్షతన వివిధ విద్యార్థి అధ్యాపక ప్రజాసంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం గౌరవాధ్యక్షులు జి.రాములు, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవివక్ష అనేది వ్యక్తిగత సమస్య కాదు, అది నిర్మాణాత్మక సామాజిక అన్యాయం అని, విద్యా సంస్థలు జ్ఞానం పంచే కేంద్రాలు మాత్రమే కాకుండా, సమానత్వ విలువలను ఆచరణలో చూపే స్థలాలుగా ఉండాలన్నారు.రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ఆకాంక్షించిన సామాజిక న్యాయం విద్యా సంస్థల్లోనే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను ఉన్నత విద్యాసంస్థలు అమలు చేయకపోవడం తీవ్ర ఆందోళన కరమని పేర్కొన్నారు. క్యాంపస్ లలో కుల దురహంకారం, సున్నితమైన వేధింపులు, స్కాలర్‌షిప్ లలో వివక్ష, గైడ్ ల కేటాయింపులో అసమానతలు వంటి సమస్యలు పెరుగుతున్నాయని వెల్లడించారు. యూజీసీ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి విశ్వవిద్యాలయంలో "సమానత్వ సెల్", "ఆంటి-డిస్క్రిమినేషన్ ఆఫీసర్", పారదర్శక ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేయాలనీ, ఫిర్యాదు వ్యవస్థను అదే యూనివర్సిటీల నుండి కాకుండా స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. అన్ని కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో యుజిసి కుల వ్యతిరేక సమానత్వ మార్గదర్శకాల తక్షణ అమలు చేయాలనీ, బాధిత విద్యార్థులకు చట్టపరమైన, మానసిక సహాయ వ్యవస్థ ఏర్పాటు. క్యాంపస్‌లలో కుల వివక్షపై అవగాహన కార్యక్రమాలు, తప్పనిసరి శిక్షణ శిబిరాలు నిర్వహించాలనీ ప్రతిపాదించారు. ఫిర్యాదులపై నిర్దిష్ట కాలపరిమితిలో విచారణ పూర్తి చేసి నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డా: గ్యార నరేష్ , పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేష్, పొడపంగి నాగరాజు, ఉపాధ్యక్షుడు రాకేష్ , జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎస్.నాగేశ్వరరావు, ఏఐపి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల్ , పి డి ఎస్ యు విజృంభణ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి లు పాల్గొని మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, జునుగరి రమేష్,లెనిన్, జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి ఎన్.సుమంత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు శ్రీమాన్, భగత్, శ్యామ్, ప్రవీణ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# గొంగ్లూరుకు జపాన్ ప్రతినిధి బృందం



**పుల్కల్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** మండలంలోని గొంగ్లూరు గ్రామంలో ఉన్న సర్వోదయ ఉమెన్ ఎంటర్ప్రైజెస్ పరిశ్రమను గురువారం జపాన్ ప్రతినిధి బృందం సందర్శించింది. ఉత్పత్తి ఉపాధి నినాదంతో 150 మంది స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన సర్వోదయ ఉమెన్ ఎంటర్ప్రైజెస్ పరిశ్రమను ఐఐటి హైదరాబాద్, జపాన్ ప్రతినిధి బృందం సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ మహిళల స్వయం ఉపాధి సహజ ఉత్పత్తుల తయారీ మార్కెటింగ్ విధానాలపై ఈ పర్యటన దృష్టి సారించింది. పరిశ్రమలో గానుగ నూనెలు, సంప్రదాయ పద్ధతిలో తయారుచేసిన పప్పులు, చిరుధాన్యాలు, చేతితో తయారుచేసిన సబ్బులు, సరుపులు,హౌస్ కీపింగ్ సామాగ్రి, వంటి పలు సహజ ఉత్పత్తులను తయారు చేసి, మార్కెటింగ్ చేసే విధానం చాలా బాగుందని మహిళలను అభినందించారు. అలాగే నాణ్యత ప్రమాణాలు మార్కెటింగ్ విధానాలు మహిళల భాగస్వామ్యం పై బృందం సభ్యులు మహిళలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, స్వయం ఉపాధి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలి

- తాండూరు మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా దీపా నర్సింలు..
- నియామక పత్రం అందజేసిన పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యలకు నిరాతనం పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు గురువారం తాండూరు పట్టణం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా దీప నర్సింహులుకు పైలెట్ రోహిత్ రెడ్డి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో లో జరిగిన సంక్షేమం అబివృద్ధి పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వెల్లడించారు. ఫ్లోర్ లీడర్ గా నియామకమైన దీప నర్సింహులుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్ చారి వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, నూతన కౌన్సిలర్లు నాగలక్ష్మి అనంత్ రెడ్డి, బి అనిల్ కుమార్, ఎండి ఇర్షాద్, ఎండి జావిద్, పట్లోళ్ల దీప నర్సింలు, సురేష్ నాయక్, నవీన సంతోష్ గౌడ్, నసీరాబాను (ఎజాజ్), అవుసుల యోగానంద్, మహేశ్వరి, సుప్రీత కరుణాకర్ పాటిల్, రూప రుద్రు పాటిల్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



**చేవెళ్ల, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంత్ రెడ్డి, డా.వైభవ్ రెడ్డి సూచించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అపోలో ఆసుపత్రి సౌజన్యంతో చేవెళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని మొత్తం 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పరీక్షల సందర్భంగా 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి, డా.వైభవ్ రెడ్డి మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించుకోవచ్చని తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్స్ పేదోళ్ల దయాకర్, మనీషా అనంత్ రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, బీజేపీ నాయకులు మాణిక్య రెడ్డి, దేవుని శర్వలింగం, ఇంద్రసేనా రెడ్డి అశోక్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పాగా వెంకటేష్, చాకలి శ్రీనివాస్, క్రిష్ణా రెడ్డి, రవి, బిజెపి పార్టీ నాయకులు చేవెళ్ల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు

- రూ.32 లక్షల నిధులు మంజూరు
- మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల జంక్షన్ల వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేయిస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు.మొత్తం 13 ప్రాంతాల్లో సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పనుల కోసం రూ.32 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. జంక్షన్ల వద్ద స్పష్టమైన రోడ్ గుర్తులు, హెచ్చరిక సూచనలు, వేగ నియంత్రణ గుర్తులు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించేందుకు సహాయపడుతుందని చెప్పారు. ఉప్పల్ మాల బస్తీ జంక్షన్, మహాదేవ్ మోటార్స్ సమీపం, సౌత్ స్వరూప్ నగర్ జంక్షన్, వెంకటేశ్వర దేవాలయ జంక్షన్, వీటి కామాన్ జంక్షన్, రామాలయం దేవాలయ జంక్షన్, టీఎక్స్ హాస్పిటల్ జంక్షన్, మండే మార్కెట్ జంక్షన్, సత్య నగర్ జంక్షన్, ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీ పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ వీధి, సూర్య నగర్ జంక్షన్, దేవేందర్ నగర్ రోడ్, రేస్ కోర్స్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో ఈ మార్కింగ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రధాన జంక్షన్లలో దశలవారీగా సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను పూర్తిగా తగ్గించేందుకు కృషి చేస్తామని పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి రామకృష్ణ, పాసికంటి నాగరాజు, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఈగ అంజనేయులు, అల్వాల్ భాస్కర్, గొరిగె మహేష్, బాకారం అరుణ్, బుత్కూరి మదన్ గౌడ్, బజార్ నవీన్ గౌడ్, ఢిల్లీ చంద్రశేఖర్, జిత్తు, నరేష్ కన్నా గౌడ్, రంగులు శేఖర్, వంశీ గౌడ్, శివ, చింటూ తదితరులు పాల్గొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న ఈ చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు.

## నాగోల్ సర్కిల్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా




**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** పెద్ద అంబర్‌పేట్ 51, 52 డివిజన్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 2025 సంవత్సరానికి సంబంధించిన సబ్బులు, నూనెలు, దుస్తులు, చెప్పులు, బెల్లం, గ్లౌజులు వంటి అవసర సామగ్రిని వెంటనే అందజేయాలని, అలాగే 2026 జనవరి నెల జీతాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్ద అంబర్‌పేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సహాయ కమిషనర్ కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ, కార్యాలయ అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన సామగ్రి ఇప్పటికీ కార్మికులకు అందలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర పురపాలక సంఘాల్లో ఈ నిబంధనలు అమలు అవుతున్నప్పటికీ, పెద్ద అంబర్‌పేట్‌లో మాత్రం సంవత్సరం గడిచినా సరఫరా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. పురపాలక సంఘం పదవీకాలం ముగిసిన తరువాత ఛైర్మన్ లేరనే కారణంతో తీర్మానం చేయలేమని అధికారులు చెప్పడం సరైనది కాదని విమర్శించారు. కలెక్టర్ ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయలేదని, మహానగర సంస్థలో విలీనం అయిన తరువాత కూడా పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత 2024లో కూడా ఆరు నెలల ఆలస్యంతో కొంత సామగ్రి మాత్రమే ఇచ్చారని, మిగిలినవి ఆలస్యంగా అందించారని, అందించిన వస్తువుల నాణ్యత కూడా తక్కువగా ఉందని నాయకులు విమర్శించారు. మండల కమిషనర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదన్నారు.కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించి, అన్ని పెండింగ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, మహేష్, అలాగే కార్మికులు మైసయ్య, మైయిపాల్, మాధవి, పోచమ్మ, జగన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బషీరాబాద్ మండలంలో దాదాపు రూ.92 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామంలో రూ.11.20 లక్షలతో ప్రహరీ గోడ, రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు మరియు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే మహిళా సమైక్య భవనంకు శంకుస్థాపన చేశారు. ఇస్మాయిల్ పూర్ గ్రామంలో (ఏకాంబరి దేవాలయం) రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు మరియు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే మహిళా సమైక్య భవనంకు శంకుస్థాపన. ఎక్మాయ్ గ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు, రూ.10 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, రూ.10.15 లక్షలతో ప్రభుత్వ



పాఠశాల పహారి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు బుయ్యని సత్యనారాయణ రెడ్డి , సర్పంచ్ లు సీమా సుల్తాన ఖలీద్, పుప్పలి శశికళ మధుసూదన్, నామ్య నాయక్, వెంకటేష్ మహారాజ్, ఏఎంసీ చైర్మన్ మాధవ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, రాకేష్ మహారాజ్, సుధాకర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాము నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించిన మాటలు మానుకోవాలి

- ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు
- కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు శ్రీకాంత్, వెంకటేష్ ఎల్లప్ప



**తాండూరు, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాటలు మాను కోవాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు శ్రీకాంత్, వెంకటేష్ ఎల్లప్ప మండిపడ్డారు. గురువారం తాండూరు పట్టణం సాయిపూర్ లోని మున్సిపల్ చైర్పర్సన్ నిరజబాల్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు శ్రీకాంత్, వెంకటేష్ ఎల్లప్పతో కలిసి మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లడం సిగ్గు చేటన్నారు. సోయిలేని మాటలతో..సోల్లుకబుర్లు మానుకోవాలని సూచించారు.పట్టణంలోని శాంతి నగర్ లో 2004 సంవత్సరంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నివాసం ఏర్పాటు చేసుకున్నారని పక్కా లోకల్ మా ఎమ్మెల్యే అన్నారు. జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మెన్ రాజుగౌడ్ .అన్నిపార్టీలలో మీరే ఉన్నారు. 20 సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉన్నారు. తోడలుకోట్టే సంస్కృతి బిఆర్ఎస్ నేతలదేనని విమర్శించారు. పట్టణ ప్రజల అశీస్సులతో మెజార్టీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు ఘనవిజయం సాదించారు.బిఆర్ఎస్ పార్టీ నేతలు ఓటమి జీర్ణించుకోలేక లేని పోని ఆరోపనలు చేస్తున్నారు. పట్టణ అబివృద్ధికి సహాకరించండి లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాబోయే 3 సంవత్సరాలలో అబివృద్ధికి సాకరించండి.అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు గాజుల మాధవి,మాజీ కౌన్సిలర్ బోయరవి, నాయకులు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలనలో పేదోడి సొంతింటి కల సాకారం



**శామీర్‌పేట్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ,అలియాబాద్ మున్సి పల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి ,అలియా బాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ ,వీరితో పాటు కౌన్సిలర్లు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై తుర్క పల్లి 1వ వార్డుకు చెందిన లబ్ధిదారులు లలిత నరేష్ సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గృహప్రవేశం అనంతరం అతిథులను శాలువాలతో సన్మానించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తికావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ నాయకులకు,అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహ వసతి కల్పించడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. పేదల జీవితాల్లో స్థిరత్వం, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాల అభివృద్ధికి దోహదపడాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ఒక నిరంతర ప్రక్రియ అని, మున్సిపల్ పరిధిలో ఇంకా అర్హులైన వారు ఉన్నట్లయితే వారందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేయిస్తా మని నాయకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్లు గురకాల దీప సాయి కృష్ణ ,కోడూరి మౌనిక దినేశ్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి , అలియాబాద్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పప్పుల వేణుగోపాల్ రెడ్డి ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు తంటం యాదగిరి ,ముద్దం రాఘవరెడ్డి ,ఉరడీ వెంకటేష్ ,భూపాల్ ,చంద్రారెడ్డి ,చట్లపల్లి నర్సింగ రావు ,కోడూరి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇందిరమ్మ ఇండ్లు



**షాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి పేదవారు ఇందిరమ్మ ఇండ్లు పొందుతున్నారు అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మణరావు గూడలో చేవెళ్ల సుభాన్ రెడ్డి, మేకల మల్లేష్ కు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు కుమార్, ప్రభాకర్, నాయకులు రవీందర్ నాయక్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 ఫిబ్రవరి 2026

# ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎంసిహెచ్‌లలో రోగులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) మరియు ఎంసిహెచ్‌లను సందర్శించి వాటి పరిధిలో నిర్మాణంలో ఉన్న పలు విభాగాలను పరిశీలించారు. జీజీహెచ్ ప్రాంగణంలో సదరం శిబిరం నిర్వహణ కోసం నిర్మిస్తున్న భవన పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ నూతన సదరం క్యాంప్ భవనాన్ని మోడల్ భవనంగా తీర్చిదిద్దాలని అందుకు తగ్గట్టుగా అక్కడికి వచ్చే వికలాంగులకు తగ్గ ఏర్పాట్లు చేయాలని, మంచి వైద్య సౌకర్యాలతో పాటు మౌలిక వసతులు కూడా కల్పించాలని ఆదేశించారు. అలాగే సీటీ స్కాన్ యంత్రం నిర్వహణ కోసం నిర్మాణంలో ఉన్న భవనం పనులను కూడా తనిఖీ చేసి, పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా భవనాల్ని అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ సౌకర్యాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సిటీ స్కాన్ కోసం రోగులు చాలా దూరం వెళ్లవలసి వస్తుందని, దీన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు చాలా దూరాభారం తగ్గడమే కాకుండా, సౌకర్యవంతంగా ఉంటుందని ఆదేశించారు. అదేవిధంగా జీజీహెచ్ ఆవరణలో కొనసాగుతున్న సీసీ రోడ్డు



పనులను పరిశీలించి, పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న అందరూ ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రోజు బయోమెట్రిక్ హాజరు నివేదికలను సమర్పించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణతో సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు.

**ఎంసిహెచ్‌లో చిన్న పిల్లల వార్డు తనిఖీ**

ఎంసిహెచ్‌లోని చిన్నపిల్లల వార్డును తనిఖీ చేసిన కలెక్టర్ పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అత్యవసర సమయంలో వినియోగించడానికి అందుబాటులో ఉన్న వెంటిలేటర్ సదుపాయం పనిచేస్తుందా లేదా అని ఆరా తీశారు. వెంటిలేటర్ పనిచేస్తుందని సిబ్బంది బదులు ఇవ్వగా, స్వయంగా కలెక్టర్ వెంటిలేటర్ సౌకర్యాన్ని దగ్గరినుండి పరిశీలించారు. అత్యవసర నిమిత్తం ఆస్పత్రికి వచ్చే చిన్న పిల్లలకు వెంటిలేటర్ సద్వినియోగ పరచాలని ఆదేశించారు. అదేవిధంగా పోషకాహారం లోపంతో ఉండే చిన్నారులను సిఫారసు చేసే ఎన్ ఆర్ సి విభాగాన్ని పరిశీలించి అక్కడ చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి రోగులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

**నూతన ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణ పనుల సందర్శన**

వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. నూతన హాస్టల్ భవనంలో విద్యార్థులకు కల్పించే సదుపాయాలను పరిశీలించారు. మార్చి 10వ తేదీ కల్లా భవనాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. చివరి దశలో ఉన్న నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని గుత్తేదారుకు ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిడెంట్ మల్లికార్జున్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# సింగల్ విండో కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిఏఓ



**మల్దకల్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారంయూరియా బుకింగ్ యాప్‌లో స్టాక్ గురించి తెలుసుకున్నారు.యూరియా బుకింగ్ యాప్ గురించి రైతులతో చర్చించారు. రైతులు యూరియా బుకింగ్ యాప్ రావడం వలన రైతులు సకాలంలో యూరియా బస్తాలు పొందుతున్నామని,దీనివలన రైతులకి మేలు జరుగుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆదేశించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ లో పంట వివరాలు ఎలా నమోదు చేయాలని వాలంటీర్స్‌కు వివరించారు. ఏదైనా సమస్యలు వస్తే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సిఎచ్ సంగీత లక్ష్మి,మండల వ్యవసాయ అధికారి కె. రాజశేఖర్,మండల వ్యవసాయ విస్తరణ అధికారులు,పీఏసీఎస్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీల్లో వనపర్తి జట్టు విజయం



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సీఎం కప్ 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో వనపర్తి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేత జట్టు సభ్యులు గురువారం కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జట్టు సభ్యులను అభినందించి, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం వనపర్తి జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కబడ్డీ క్రీడాభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనలో జిల్లా పరిపాలన తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లికాగా గతేడాది మూలమల్ల కబడ్డీ బృందానికి రూ. 3.50 లక్షలతో కలెక్టర్ తన నిధుల నుంచి మ్యాట్ ఇప్పించిన విషయం తెలిసిందే.జట్టు సభ్యులు మాట్లాడుతూ, గత సంవత్సరం నుంచి ములమల్ల గ్రామంలో కబడ్డీ సాధనకు అవసరమైన సదుపాయాలు కల్పించినందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో తాము రాష్ట్ర స్థాయిలో విజయం సాధించగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కురుమయ్య, పద్మా రెడ్డి, కోచ్‌లు, క్రీడాశాఖ అధికారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలి



**ఊర్కొండ, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. మండలం లోని ముచ్చర్లపల్లి గ్రామ పరిధిలో జరుగుచున్న ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించడం జరిగింది. కూలీలతో మాట్లాడి 307 రూపాయల రోజువారీ కూలీ రావాలంటే ఫీల్డ్ అసిస్టెంట్ సూచించిన మేర పని చేయాలని, ఎక్కువ మంది కూలీలు పనికి వచ్చునట్లు చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో కూలీలకు నీడ కొరకు షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని, త్రాగేటందుకు మంచినీరు అందుబాటులో ఉంచాలని, మెడికల్ కిట్, వడదెబ్బ తగలకుండా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశంలో ఉంచుటకు ఫీల్డ్ అసిస్టెంట్ బక్క మల్లయ్యకు సూచించడం జరిగింది. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కనీసం 100 మంది కూలీలు పనిలోకి వచ్చునట్లు అందరు ఫీల్డ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తగిన చర్యలు తీసుకోవాలని తెలియపరచడం జరిగింది.

# జనసేన క్రియాశీల సభ్యత్వాలు ప్రారంభం

**మక్తల్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర యువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యం లో నియోజకవర్గంలో, మండలాల్లో జనసేనపార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలమేరకు, మహబూబ్ నగర్ పార్లమెంటరీ ఇంచార్జ్ ముమ్మా రెడ్డి ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు క్రియాశీల సభ్యత్వాలు గురువారం ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం లో పూజ కార్యక్రమం నిర్వహించి ఘనంగా ఉద్యమి క్రియాశీల సభ్యత్వాలు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ ఉద్యమి కార్యక్రమం ఒక మహోన్నతమైన కార్యక్రమం దేశం లో ఎక్కడ లేని విధంగా పార్టీ కోసం పని చేసే జనసైనికులకు అనుకోకుండా ఆపద జరిగిన మృతి చెందిన సమయం లో వాళ్ల కుటుంబ సభ్యులకు ఎంతో కొంత ఆసరాగా ఉండాలని మేలు జరగాలని ఈ ఉద్యమి సభ్యత్వాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి జనసైనికుడు 400 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల రూపాయలు ఇన్స్యూరెన్స్ ఆ కుటుంబానికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆక్సిడెంట్ లో చిన్న చిన్న గాయాలు తగిలితే 2 లక్షల వరకు జనసైనికుడి ఆస్పత్రి ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరు జనసేన పార్టీ సిద్ధాంతాలు పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చిన వారు పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమి సభ్యత్వ కార్యక్రమాన్ని తీసుకెళ్తాం అని అన్నారు. ఈ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నేటి నుండి మార్చ్ 10 వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ సభ్యత్వాలను చేసే వాలంటీర్లకు లింక్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఒక గొప్ప ఆలోచనతో మూడు పేర్లతో నామకరణం చేశారు. ఉద్యమి అంటే సభ్యత్వం తీసుకునే వారు, సాధక్ అంటే సభ్యత్వం చేసే వారిని,




ప్రదాత అంటే పార్టీ కి బలంగా అన్ని విధాలుగా పార్టీ కోసం పని చేసే వారని ఇలా మూడు రకాలుగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామన్ గౌడ్, గౌడి బాల్ రెడ్డి, శివ ప్రసాద్, ఉమేష్, శివ, పవన్, కె ప్రవీణ్, విజయ్ కుమార్, రవి కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో గంజాయి స్వాధీనం

• ఇద్దరు అరెస్ట్



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** రామచంద్రపురం పరిధిలోని అంబేద్కర్ కాలనీ హనుమాన్ దేవాలయం సమీపంలో కారులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం టీఎస్ 09 జీడీ 0572 నంబర్ గల కారులో గంజాయి అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న మహమ్మద్ ఖాన్ (33), మహమ్మద్ ఓవాజ్ (23)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, కారును జప్తు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. రామచంద్రాపురం మండలం పరిధి ప్రాంతంలో మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# విశ్వనాథ శాస్త్రి శత జయంతి ఉత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానాలు

**శివ్వంపేట ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో మార్చి1న నిర్వహించబోయే వేద గణాపాటి శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి యొక్క శత జయంతి వేడుకలకు ఆహ్వానిస్తూ, శివ్వంపేట లోని భగలాముఖి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రముఖులకు ఆహ్వానాలను అందజేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు, గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ను హైదరాబాద్ లో శాస్త్రుల వెంకటేశ్వర శర్మ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి జయంతి ఉత్సవాలకు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అదేవిధంగా బుధవారం పుష్పగిరి పీఠాధిపతి శ్రీ అభినవొద్దండ విద్యా శంకరభారతి మహాస్వామి వారిని వెంకటేశ్వర శర్మ



దంపతులు బగలాముఖీ శక్తిపీఠంలో జరిగే శతజయంతి వేడుకలకు రావాలని ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది. అభినవ విద్యారణ్య బిరుదాంకితులు విశ్వనాథ శాస్త్రి శత జయంతి వేడుకలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖులు, ఉన్నత అధికారులు, ఆధ్యాత్మిక వేత్తలను ఆహ్వానించినట్లు వెంకటేశ్వర శర్మ తెలియజేశారు.

# పోలీస్ శాఖకు రెండు పెట్రోల్ పంపులు



**మెదక్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ శాఖకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు సంబంధించిన రెండు పెట్రోల్ బంకులు మంజూరయ్యాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ రెండు పెట్రోల్ బంకుల్లో ఒకటి శంకరంపేట్ (ఆర్) మండల కేంద్రంలో, రెండవది మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన (ఆవుసులపల్లి గ్రామ పరిధిలో) ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. శంకరంపేట్ (ఆర్) మండల కేంద్రంలో మంజూరైన పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉండగా, ఈ రోజు ఆవుసులపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకుకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ రెండు పెట్రోల్ బంకులు పూర్తిగా పోలీస్ శాఖ ఆధీనంలో నిర్వహించబడతాయని, నిర్మాణ పనులు పూర్తైన అనంతరం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్, రంగానాథ్, సీఐ లు జర్జ్, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ శైలందర్, రామకృష్ణ, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

• జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులు, దర్యాప్తులో నాణ్యత, నేరాల నియంత్రణ అంశాలపై ఎస్పీ సమీక్షించారు. అలాగే ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో హిస్టరీ షీట్స్ అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండేలా దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. నైట్ బీట్ మరియు పెట్రోలింగ్ విధులలో నాణ్యత పెంచి మరింత సమగ్రవంతంగా నిర్వహించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ప్రతి




పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలి అని తెలిపారు. దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అందించాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని, ఎస్.హెచ్.ఓ.లు తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహనతో ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు తరచూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సైబర్ టీమ్ వారు జిల్లాలో సైబర్ క్రైమ్ చేదనలో గల పురోగతిని జిల్లా ఎస్పీకి వివరించారు. చట్ట ఉల్లంఘనల పై కఠిన చర్యలు తీసుకుంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్కను మరింత వేగవంతం చేయాలి వంటి అంశాలపై జిల్లా ఎస్పీ సూచనలు ఇవ్వడమైనది. అంతేకాకుండా జిల్లాలోని సిబ్బంది వారి సమస్యల గురించి మీ దగ్గరకు వచ్చినప్పుడు ఎస్ఐ లు ప్రాపర్ గా ఎండార్స్ చేసి పంపాలని ఎస్పీ జిల్లా ఎస్సై, సీఐ లను ఆదేశించారు. పురపాలక ఎన్నికలను 100 శాతం శాంతియుతంగా నిర్వహించినందుకు జిల్లాలోని ఆఫీసర్స్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ మొగిలయ్య, గద్వాల,అలంపూర్, శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, వి. ప్రదీప్ కుమార్, టాటా బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సి.సి.ఎస్.ఇన్స్పెక్టర్ రవి, అలాగే అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా కార్యాలయ ఎస్సైలు పాల్గొన్నారు.

# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** కాలాను గుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డా. సారిక అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల్ లెవెల్ కన్వర్జెన్సీ కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ ఆరోగ్య కేంద్ర సమావేశ మందిరములో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సారిక అధ్యక్షతన అంతర్ శాఖల సమన్వయంతో సాంఘిక



సంక్షేమ శాఖ, విద్యాశాఖ రెవిన్యూ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఆయా హై స్కూల్ హెడ్మాస్టర్స్ ఎంఈఓ , ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా వైద్యులు సారిక మాట్లాడుతూ అంతర్ శాఖల సమన్వయం యొక్క ఆవశ్యకత ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై లోతుగా వివరించారు. అందులో భాగంగా క్రమం తప్పకుండా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం యొక్క ఆవశ్యకత, రక్తహీనత లాంటి వ్యాధులను అధిగమించుట తదితర వాటిపై పలు సూచనలు చేశారు. స్వచ్ఛమైన తాగునీరు పలు అంశాల మరియు ఆడపిల్లల వ్యక్తిగత పరిశుభ్రత (నెలసరి బహిష్టు) పై సంవత్సరానికి రెండు పర్యాయాలు ఆల్బెండజోల్ మాత్రలు, అనిమియ వ్యాధిని అధిగమించుటకు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆల్బెండజోల్ మాత్ర ఎంతో ఆవశ్యకతమైనదని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య బోధకులు, హాస్టల్ వార్డెన్లు ఆయా హెడ్మాస్టర్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూపర్వైజర్లు పాల్గొన్నారు.


# విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుకు, అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి): విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలతో పాటు గణిత సామర్థ్యాన్ని పెంపొందిస్తూ వారి అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. గురువారం గీసుగొండ మండలంలోని ఎంపీపీఎస్ ధర్మారం పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఫౌండేషనల్ లీటరసీ, న్యూమరసీ కార్యక్రమం అమలు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 2వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న గణిత పరీక్షను పరిశీలించి, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను అంచనా వేస్తున్న విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను ఆప్ లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో అవసరమైన మూలాధార నైపుణ్యాలను పూర్తిగా సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నేర్చుకునే ప్రక్రియను ఆసక్తికరంగా మరియు ఫలప్రదంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం ట్రాక్ చేస్తూ, అవసరమైన అకాడమిక్ సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి. రంగయ్య నాయుడు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ, ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్



హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చాహత్ బాజ్ పాయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కి అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా స్వాగతం పలికి పూల మొక్కలు పుష్పగుచ్ఛాలను అందించారు. జిల్లా కలెక్టర్ గా కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్ గా వెళ్ళగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.

## సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే మురళి నాయక్
- కేసముద్రం మున్సిపాలిటీ చైర్మన్ గా సునీత,వైస్ చైర్మన్ గా రమ,కౌన్సిలర్ల బాధ్యతలు స్వీకరణ



కేసముద్రం, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు సమన్వయంతో,సమిష్టి కృషితో పట్టణాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార మహోత్స వానికి విచ్చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్ ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ గా బానోత్ సునీత,వైస్ చైర్ పర్సన్ గా డాక్టర్ అల్లం రమ పదవి బాధ్యతలను స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గాన్ని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్,ఎమ్మెల్యేగా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్,ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ప్రజలు,మహిళలు పాల్గొన్నారు.

## తెలంగాణ వైభవాన్ని చాటిన 'ఆంగ్ల ఉపాధ్యాయురాళ్లు'

- 'రీజనల్ కాంట్రిబ్యూషన్ డే' లో పాల్గొన్న తెలంగాణ ఉపాధ్యాయులు
- సమ్మక్క, సారలమ్మ ల వేషాదాలలో అలరించిన ఉపాధ్యాయురాలులు...



మంగపేట ఫిబ్రవరి 26(జనంసాక్షి) : ప్రాంతీయ ఆంగ్ల విద్యాసంస్థ బెంగళూరులో ఏర్పాటుచేసిన ' రీజనల్ కాంట్రిబ్యూషన్ డే ' సందర్భంగా శ్రీ సమ్మక్క సారలమ్మల వేషాధారణలో ప్రాంతీయ అస్తిత్వాన్ని చాటిన ములుగు జిల్లా ఆంగ్ల బోధన ఉపాధ్యాయురాళ్ళు మొప్ప కావ్య, ఆర్. వందన అందరి దృష్టిని ఆకర్షించారు. గురువారం దక్షిణ భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన బెంగళూరు జ్ఞాన భారతి క్యాంపస్ లోని నిర్వహించిన రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ వేదికలో తెలంగాణ సాంస్కృతిక, సాంప్రదాయాల ప్రదర్శనలతో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక, సాంప్రదాయాల ప్రదర్శనను ములుగు జిల్లా మంగపేట మండలం తొండ్యాల లక్ష్మీపురం ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలు మొప్ప కావ్య, మంగపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విధులను నిర్వహిస్తున్న ఆర్. వందన లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉపాధ్యాయుల ప్రదర్శనను ఇనిస్ట్యూట్ డైరెక్టర్ సి ప్రియా మంథారో. అకాడమిక్ హెడ్, తెలంగాణ ఇంచార్జ్ రవి నారాయణ, చక్రకుడి, కోర్సు డైరెక్టర్ హితేష్ సి భగత్ ప్రత్యేకంగా ఉపాధ్యాయురాలను అభినందించారు.

## సైబర్ కేటుగాళ్ల వలలో అసిఫాబాద్ వాసి



ఆసిఫాబాద్ ,ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన విశాల్ పవర్ జిమ్ నిర్వాహకుడు ఖండ్రే విశాల్ అనే యువకుడి బ్యాంక్ అకౌంట్ ల నుండి అతని ప్రమేయం లేకుండా 3 లక్షల 9 వేల రూపాయలను సైబర్ కేటుగాళ్లు దండుకున్నారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్క సారిగా ఫోన్ కు మెసేజ్ లు రావడంతో గమనించగా సైబర్ దుండగులు 500 రూపాయల నుండి 50,000 రూపాయల వరకు కొద్ది కొద్ది గా డబ్బు బ్యాంక్ ఖాతా నుండి డ్రా అయ్యాయని,తనకు ఎలాంటి ప్రమేయం లేకుండా అకౌంట్ లో నుండి డబ్బులు పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. తాను ఎలాంటి లింకులను కూడా క్లిక్ చేయలేదని అయిన కూడా తన బ్యాంక్ అకౌంట్ నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

# ప్రతి సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలి

- ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ లో జిల్లా రెండో స్థానం
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు అవుతాయి
- స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి



జనగామ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు బాధ్యత యుతం గా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇరిగేషన్ అంశాల మీద సంబంధిత అధికారులతో కలెక్టర్, శాసనసభ్యులు గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ....ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ లో... జనగామ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,అధికారులకు శాసనసభ్యులు అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మండలాల వారీగా మార్క్ అవుట్ ఇచ్చి పనులు ప్రారంభం కానీ, ఇప్పటి వరకు మార్క్ అవుట్ కూడా చేయని ఇండ్ల వివరాలను సేకరించి వాటిపై ఎంపీడివోలు సమీక్షా చేయాలని తెలిపారు. లబ్ధిదారులు వారం రోజులలో పనులు ప్రారంభించేలా.... ఎంపీడివోలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో ఒక్క ఇల్లు కూడా ల్యాప్స్ కావద్దని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ఆ దిశగా అధికారులు పని చేయాలని తెలిపారు. ఏప్రిల్ లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు వచ్చే అవకాశం ఉందని మళ్ళీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు అవుతాయాని అన్నారు. మెదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే ఇచ్చామని ఇప్పుడు రెండో విడతలో ఇంటి స్థలం లేని వారికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కాబట్టి తహసీల్దార్లు మండలంలోని ఏ ఏ గ్రామాలలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందో, ఇళ్ల నిర్మాణం కోసం భూ సేకరణ జరిగిందో ఆ వివరాలు సేకరించాలని ఆదేశించారు.

ఉన్న స్థలంలో ఇప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం ఒక ఎకరంలో ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వవచో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిబంధనల ప్రకారం లే అవుట్ సిద్ధం చేయాలని అన్నారు. మార్చి 15 న ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం ఉంటుందని ఈ సమావేశానికి పూర్తి స్థాయి వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. సాగు నీరు అందక ఒక్క ఎకరం కూడా ఎండిపోవడానికి వీలు లేదని ఒక్క ఎకరం ఎండిన అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. గోదావరి లో సరిపడా నీటి లభ్యత ఉంది కాబట్టి మార్చి చివరి వరకు నీటిని లిఫ్టింగ్ చేయాలని తెలిపారు. మార్చి చివరి వరకు కూడా వ్యవసాయానికి నీరు ఇవ్వాల్సి ఉంటుందని కావున రిజర్వాయర్ లలో నీటి నిలువలు తగ్గకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకటి, రెండు రోజులు పంపింగ్ లో ఏమైనా సమస్యలు వచ్చినా నీటి విడుదలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. బొమ్మకూరు కాలువలో పూడికతీత, చెట్ల తొలగింపు పనులను వారం రోజుల్లో పూర్తిచేసి మంగలి బండ తండా వరకు నీరు అందించాలని తెలిపారు. జఫర్ గడ్ మండలం హిమ్మత్ నగర్ వరకు నీరు చేరాలని అందుకు కాలువ పూడిక తీత పనులకు ఎస్ డిఎఫ్ నుండి 5లక్షలు మంజూరు చేస్తానని వెంటనే పనులు ప్రారంభించి వారం రోజుల్లో నీరు అందించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మనందరి బాధ్యత అని అన్నారు. మనం చేసే పనిలో మనకు సంతృప్తి ఉండాలని ఆ దిశగా పాజిటివ్ గా ఉండాలని సూచించారు. చట్ట పరిధిలోకి లోబడి పేద ప్రజలకు ఏ విధంగా సహాయం చేయగలం, గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయగలం అని ఆలోచించాలని వెల్లడించారు. ఈజీఎస్ నిధులకు సంబందించిన పనులను మార్చి 21నాటికి పూర్తి చేసి అందుకు సంబందించిన బిల్లులు ప్రభుత్వానికి పంపించాలని అప్పుడే పనులు చేసిన వారికి సకాలంలో బిల్లులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో అధికారుల పర్యవేక్షణ మరింత మెరుగవ్వలన్నారు. మంజూరు అయిన ప్రతీ ఇల్లు నిర్మాణ దశ కి వెళ్లాలన్నారు. జనగామ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను మొదటి స్థానం నిలపడానికి విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లకి శాసనసభ్యులు అభినందన లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన రిజ్వాన్ భాషా షేక్ ని, అలాగే +ఎవీజ కి జోనల్ కమిషనర్ గా బదిలీ పైన వెళ్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లను శాసనసభ్యులు శాలువాతో సత్కరించి పూల మొక్కను బహుకరించారు.

## మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోండి

- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- 50 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్ ల పంపిణీ
- కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న జిల్లా కలెక్టర్




వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి (జనంసాక్షి): మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి సాధించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద లు పేర్కొన్నారు. గురువారం శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ తో కలిసి జన్‌పాకలోని గోల్డెన్ విల్లా రిసార్ట్ లో నిర్వహించిన ఇందిరమ్మ మైనార్టీస్ మహిళా శక్తి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకం లో భాగం గా పరకాల నియోజకవర్గంలో అర్హులైన మహిళలకు కుట్టు మిషన్ లను పంపిణీ చేయడం జరిగిందని ఇందులో సంగెం, గీసుగొండ మండలాల్లోని, బల్దియా పరిధి లోని 16 ,17 డివిజన్లకు చెందిన మొత్తం 50 మంది లబ్ధిదారులకు అందజేశామని, మహిళలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ లబ్ధిదారులు కుట్టు యంత్రాలను సమర్థంగా వినియోగించి ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని, జిల్లా లో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడం తో పాటు ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులను అభ్యసించడం ద్వారా అధునాతన నైపుణ్యాలను పొంది ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, ఆర్డీవో సుమ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## హనుమకొండ కోర్టుకు బాంబు బెదిరింపులు

వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 26( జనం సాక్షి) : హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని కోర్టుకు గురువారం బాంబు బెదిరింపులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో కూడా పలుమార్లు ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. గురువారం కూడా వచ్చిన సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు వెంటనే కోర్టు భవనంలో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు పంపించారు. సుబేదారి పోలీసులు కోర్టుకు చేరుకుని భద్రతా చర్యలు చేపట్టారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక పరికరాలతో కోర్టు ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. ఏదైనా అనుమానాస్పద వస్తువు ఉందా అనే దానిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, ఫిబ్రవరి 26 (జనంసాక్షి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, టి.జి.ఎస్.డబ్ల్యూ. రెసిడెన్షియల్ పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు) లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి ఇంటర్మీడియట్ పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరంలో జనరల్ 5 వేల 372 మంది, ఒకేషనల్ 888 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 5 వేల 227 మంది, ఒకేషనల్ 830 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని, పరీక్ష సమయంలో 163 బి. ఎన్. ఎస్. ఎస్. సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి26 (జనం సాక్షి) : గోదావరి నది పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలు నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంను దర్శించుకోవడానికి అలాగే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు,రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రాంతాల వారీగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని, పుణ్యస్నానాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. భక్తులకు వసతి, తాగునీరు, శాశ్వత, మొబైల్ టాయిలెట్లు,లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు సమకూర్చాలని పేర్కొన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలనిజిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేపట్టిన పనులను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూపుష్కరాల సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్,పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని,పటిష్ట నిఘా ఉంచుతామని వివరించారు. భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు పూర్తి చేసుకునేలా పోలీసు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఏఎస్పీలు రాజేష్ మీనా,సాయికిరణ్,డిపివో శ్రీనివాస్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, బాసర ఆలయ ఈవో విజయ రామారావు,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వేకు సహకరించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(జనంసాక్షి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను ప్రజలు వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కే.హరిత అన్నారు. గురువారం అసిఫాబాద్ మండలం దానాపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం 1923 ప్రకారం దానాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జిపిఆర్ఎస్ సాంకేతికతతో వ్యవసాయ భూముల సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయితే భూ వివాదాలు తగ్గి రైతులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయి అని పేర్కొన్నారు. అలాగే ప్రధానమంత్రి ముద్ర రుణాలు, ఎస్సీ ఎస్టీ అభివృద్ధి రుణాలు, స్వయం ఉపాధి పథకాలు, విశ్వకర్మ, జన సురక్ష పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
27 ఫిబ్రవరి 2026

# రైతులు వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి

- అర్హులైన ప్రతి రైతుకు వ్యవసాయ పనిముట్లు అందించాలి
- ట్రాక్టర్లు ఉంటే పథకాలు రద్దు అనే విధానాన్ని ఎత్తివేయాలి
- ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి



**నర్సాపూర్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను అందజేయాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను, యంత్రాలను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాక్టర్లు ఉంటే ప్రభుత్వ పథకాలు అందవనే విధానాన్ని రద్దు చేయాలని ఆమె అన్నారు . ప్రభుత్వ పథకాలు రద్దు అవుతున్నాయనే భయంతో రైతులు ట్రాక్టర్లను తీసుకోడానికి వెనకడుగు వేస్తున్నారని, ప్రభుత్వాలే సబ్సీడీ ఇస్తున్నప్పుడు ఇలాంటి పద్దతిని తొలగించడానికి ఆర్డర్ తీసుకురావాలని అన్నారు. రైతులు తమ కడుపు నింపుకొని ఇతరుల కడుపు నింపే గొప్ప స్వభావం గల వారని, రైతుల కోసం ఎంత చేసిన తక్కువేనని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వచ్చేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. వ్యవసాయ పనిముట్లు నర్సాపూర్ నియోజకవర్గానికి 343 మంది రైతులకు మంజూరు అయ్యే అవకాశం ఉందని అన్నారు. కాని నేడు కేవలం 147 మంది రైతులకు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుతం 71 మంది రైతులకు మాత్రమే వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన రైతులందరికి వ్యవసాయ పనిముట్లు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ వ్యవసాయ పనిముట్లతో రైతులు తమ పని తాము చేసుకుంటారని పైగా పెట్టుబడి తగ్గుతుందని వెల్లడించారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, కొనుగోలు కేంద్రాలు, సబ్సీడీపై విత్తనాలు తదితర పథకాలను తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.15 వేలు ఇస్తామని ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. నాలుగు సార్లు రావలసిన రైతుబరోసా ఒక్క సారి మాత్రమే రావడం జరిగిందని, ఇప్పటికే రూ.27 వేల కోట్లు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడ్డదని గుర్తుచేశారు. అంతేకాకుండా బోనస్ డబ్బులు కూడా చాలా మంది రైతులకు అందలేదని తక్షణమే అందివ్వాలని అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడం లేదని, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి దేవకుమార్, తహసిల్దార్ శ్రీనివాస్, ఏడీఏ సంధ్యారాణి, ఏఓ దీపిక, ఏఈవో దుర్గప్రసాద్, రిత్విక. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు షేక్ హుస్సేన్, సుధాకర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రైతు రక్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ , రైతులు పాల్గొన్నారు.

## పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా శంషాబాద్ మండలంలో నిర్మాణం పూర్తైన గృహాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. మదనపల్లి కొత్త తండా, శంకరాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, వారికి ఇంటి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవారికి దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సొంత ఇల్లు లభించడంతో లబ్ధిదారులు ప్రభుత్వం మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. చంద్రా రెడ్డి , నీరటి రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏరుగట్లగ్రామంలో గుప్త నిధుల కోసం అర్ధరాత్రి తవ్వకాలు



**పెనుబల్లి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలో గుప్తనిధుల కోసం ఓ రైతు పత్తి చేలో తవ్వకాలు జరిపిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏరుగట్ల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గ్రామ సమీపాన గల పత్తి చేలో గుప్తనిధులు వెలికి తీసేందుకు దూర ప్రాంతం నుండి మంత్రగాళ్లను తెప్పించి క్షుద్ర పూజలు చేసి జెసిబితో అర్ధరాత్రి తవ్వకాలు మొదలుపెట్టారు. సమీపానగల గిరిజనులు పసిగట్టి సంఘటన స్థలానికి చేరుకొని మంత్రగాళ్లను అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. మంత్రగాళ్లను రప్పించిన గ్రామంలోని వ్యక్తులు పరారయ్యారు. గుప్తనిధులు కోసం పత్తి చేను నుండి తాము ఆరాధించే ముత్యాలమ్మ వరకు జెసిబి తో తొవ్వేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా ముత్యాలమ్మ విగ్రహాన్ని తొలగించి అక్కడ గుప్త నిధులు ఉన్నాయని తవ్వకాలు జరిపారని తిరిగి మరల గుప్త నిధులు కోసం అదే ప్రాంతానికి స్థానికుల సహకారంతో మంత్రగాళ్లు రావడం జరిగిందని గిరిజనులు తెలిపారు. ఏరు గట్ల గుప్త నిధులు కోసం తవ్వకాలు జరిపిన మంత్రగాళ్లు తమ అధీనంలో ఉన్నారని, జెసిబి మోటార్ సైకిల్ గ్రామంలో ఉన్నట్టువి ఎం బంజర్ ఎస్ ఐ వెంకటేష్ తెలిపారు. మంత్రగాళ్లను తెప్పించిన స్థానికులను కూడా అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ ఐ తెలిపారు.

## చండూరులో పట్టపగలే చోరీ

- ఆటో డ్రైవర్ ఇంట్లో 6 తులాల బంగారం, నగదు అపహరణ



**చండూరు, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు, పట్టపగలే భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చండూరుకు చెందిన దేప వెంకట్ రెడ్డి (45) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. బుధవారం మధ్యాహ్నం సమయంలో కస్తాల గ్రామంలో జరుగుతున్న తన బంధువుల వివాహానికి భార్యతో కలిసి వెళ్లారు. వేడుక ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి, ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండటం చూసి వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా..బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని బట్టలన్నీ గదిలో చిందరవందరగా పడి ఉన్నాయి. దాచుకున్న 6 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. 80,000 రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెంకట్ రెడ్డి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్.ఐ శివకుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు. పక్కా ప్లాన్‌తోనే దొంగలు ఈ పని చేసినట్లు కనిపిస్తోంది. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం అని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు. పట్టపగలే దొంగతనం జరగడంతో చండూరు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌లో మౌనికకు బంగారు పతకం

- అభినందించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్



**హాలియా, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వలసాని లింగయ్య కుమార్తె వలసాని మౌనిక రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యుడు నోముల భగత్ కుమార్ గురువారం మౌనికను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మౌనిక కృషి, పట్టుదల ఇతర క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, అనుముల సుధాకర్ రెడ్డి, పల్లెబోయిన సైదులు, కోటిరెడ్డి, ఆంజనేయులు, రాంబాబు, లింగయ్య, నాగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి

- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** జిల్లా పోలీస్ నందు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కృష్ణయ్య కుటుంబానికి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నరసింహ ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ నగదు చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయాలని,మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని అన్నారు. సిబ్బంది కుటుంబాలకు ఆరోగ్య భద్రత పథకం బాసటగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్, సంక్షేమ ఆర్ఎస్ఐ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టాటా టిప్పర్ లారీని పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం జంగారెడ్డిగూడెం రోడ్ నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న అనుమానాస్పద టాటా టిప్పర్ లారీ నం. AP 39 TF 4891 ను ఆపి తనిఖీ చేశారు. ఈ తనికెళ్లలో భాగంగా లారీ డ్రైవర్ పేరు కొమల దుర్గ ప్రసాద్(32),కోయలగూడెం గ్రామం,ఏలూరు జిల్లా నివాసి అని విచారణలో తెలిసింది,ఇట్టి ఇసుకను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోవ్వూరు ర్యాంపు వద్ద ఇసుకను లోడ్ చేసి,ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా సత్తుపల్లి ప్రాంతంలో అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు టాటా టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని,డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం కేసును మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## జిల్లాలో జరిగిన ఉపాధిహామీ పనుల పరిశీలన



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్‌జీగా మారుస్తున్న తరుణంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ బృందం సభ్యులు సంజయ్ కుమార్ నేతృత్వంలో సూర్యాపేట జిల్లాలో మూడు రోజుల పర్యటన సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లాలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఈజీఎస్ పథకాల పనులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను కేంద్ర బృందం, కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, కేంద్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్బరీ తోట సాగుతో రైతుకు అధిక లాభాలు




**తలకొండపల్లి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మల్బారీ తోటను సాగు చేసి,పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని,సాంప్రదాయ పంటలతో పోలిస్తే తక్కువ నీటితో తక్కువ సమయంలో సంవత్సరం పొడువునా పట్టు పరిశ్రమ ఆదాయం ఇస్తుందని రైతు శక్రు నాయక్ తెలిపారు. మండల పరిధిలోని కోరింతకుంట తండా గ్రామంలో సాగు చేస్తున్న మల్బరీ తోటలు,షెడ్లు పట్టుపురుగుల పెంపు విధానాన్ని పరిశీలించేందుకు గురువారం జనగాం జిల్లా రైతులు వచ్చారు. మల్బరీ పంట సాగు విధానం పద్ధతులను స్వయంగా ఆదర్శ రైతు శక్రు నాయక్ వారికి వివరించారు. మల్బరీ సాగు విధానం మెలకువలు పట్టుపురుగుల పెంచుకునే విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు రైతులు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. మల్బారీ పంట సాగుతో అదిక లాభాన్ని ఆశిస్తూ,యువరైతులకు ఆదర్శంగా నిలుస్తూన్న శుక్రు నాయక్,ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా మార్కెట్ ఆఫీసర్ సిహెచ్ నవీన్ పాల్ రెడ్డి,అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ టి.రాజయ్య,రైతులు రమేష్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెనుబల్లి నూతన ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే



**పెనుబల్లి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** సత్తుపల్లి శాసనసభ్యురాలు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ గురువారం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా రాగమయి, దయానంద్‌లు సత్తుపల్లి సింగరేణి సహకారం తో ప్రభుత్వ ఆసుపత్రి కీ వైద్య పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్ర నాయక్ , ఎంపీడీఓ అన్నపూర్ణ,ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు,బొర్రాకోటేశ్వరరావు, రాజబోయిన కోటేశ్వరరావు, దొంతు మాధవ, మేక తొట్టి కాంతయ్య, మిట్టపల్లి కిరణ్ కుమార్,కర్రి సత్యనారాయణ, వంగా నిరంజన్ గౌడ్, ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి



**తలకొండపల్లి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ అన్నారు. మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని 3వ వార్డులో గురువారం అండర్ డ్రైనేజ్ పునర్నిర్మాణ పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుమ్మడి రాజు,వార్డు సభ్యులు వంకూరి శ్రీరాములు, చినుకుంట్ల రాజు,మెడమోని రాజు, గుమ్మడి శారద, చినుకుంట్ల అంజమ్మ,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్,మాజీ సర్పంచ్ బండి రఘుపతి,సెక్రెటరీ యాదగిరి, సీనియర్ నాయకులు వెంకటరాజిరెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది గోపాల్,చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం చేయొద్దు

**సూర్యాపేట, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం చేయవద్దని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ లో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ మహేంద్రనాథ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే పోలీస్ శాఖ లక్ష్యమని అన్నారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కకూడదని కోరారు.




# నల్లగొండ మెడికల్ కళాశాలను ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తా..

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**కనగల్లు, ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అన్ని కళాశాల కంటే నల్లగొండ మెడికల్ కళాశాలను ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు ,భవనముల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ కేంద్రంలోని మెడికల్ కళాశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు . అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వంలో కళాశాల నిర్మాణం పనులు నత్తనరకగా నడిచాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాశాలకు అత్యధికనిధులను కేటాయించి మౌలిక సదుపాయాలతో త్వరితగతిన పనులను పూర్తి చేయించి ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. కళాశాలకు ఏషియన్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి రావడం జరిగిందని త్వరలో ఆయనతో ఎం ఓ యు కుదురుచుకొని ప్రతి సంవత్సరం ఈ కళాశాల నుంచి 35 మంది మెడికల్ విద్యార్థులను గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆసుపత్రికి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక, వైద్య, విద్యా రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఎక్కువ నిధులను కేటాయించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ మధ్యనే బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు కళాశాలకు దీటుగా పాఠశాలను అన్ని వసతులతో సుందరీకరించుకోవడం జరిగిందని.,నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ జై శ్రీనివాస్, నగర డిప్యూటీ మేయర్ అస్రాఫ్ ఆలీ , మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




## ప్రైవసీ డిస్‌ప్లేతో
# శాంసంగ్ 26 అల్ట్రా..
### స్మార్ట్‌ఫోన్ ప్రియుల కోసం అదిరే ఫీచర్లు



**న్యూఢిల్లీ:**స్మార్ట్‌ఫోన్ ప్రియుల కోసం దక్షిణకొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ శాంసంగ్ కొత్త సిరీస్‌ను ఆవిష్కరించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ 2026 ఈవెంట్‌లో ఎస్26 సిరీస్ ఫోన్లను విడుదల చేసింది. టెక్ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న శాంసంగ్ గెలాక్సీ ఎస్26 అల్ట్రా తో పాటు ఎస్26, ఎస్26+ మోడళ్లను తీసుకొచ్చింది. మరి ఈ ఫోన్ల ఫీచర్లు, ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..!

**శాంసంగ్ గెలాక్సీ ఎస్26 అల్ట్రా:**

గెలాక్సీ ఎస్26 అల్ట్రా.. శాంసంగ్ థర్డ్ జనరేషన్ ఏఐ ఫోన్. 6.90 అంగుళాల డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ డిస్‌ప్లేతో తీసుకొచ్చిన ఈ ఫోన్‌లో 'ప్రైవసీ డిస్‌ప్లే' ఫీచర్ ప్రత్యేకం. ప్రపంచంలోనే ఈ ఫీచర్ నుంచి తొలి ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ ఇదే కావడం విశేషం. పక్కనున్న వ్యక్తులు మీ ప్రైవేట్ విషయాలు తెలుసుకునేందుకు వీలు లేకుండా మీ ఫుల్ స్క్రీన్‌ను ఇది హైడ్ చేస్తుంది. ఎస్26 అల్ట్రాలో స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జన్ 5, 200 మెగాపిక్సెల్ క్వాడ్ రేర్ కెమెరా సిస్టమ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయి. ధర విషయానికొస్తే.. ఎస్26 అల్ట్రా ప్రారంభ ధర భారత్‌లో రూ.1,39,999గా నిర్ణయించారు. 12జీబీ+ 512జీబీవేరియంట్ ధర రూ.1,59,999, 16జీబీ + 1టీబీ టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.1,89,999గా ప్రకటించారు. నలుపు, నీలం, ఊదా, తెలుపు, పింక్ గోల్డ్ రంగుల్లో అందుబాటులో ఉండనుంది.

**గెలాక్సీ ఎస్26+**

6.7 అంగుళాల డైనమిక్ ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే, 2600 నిట్స్, 120 ఊళి రిఫ్రెష్ రేటుతో దీన్ని తీసుకొచ్చారు. 4,900 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం, 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరా, 12 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. తెలుపు, నలుపు, నీలం, ఊదా రంగుల్లో అందుబాటులో ఉండనుంది. ప్రారంభ ధర రూ.1,19,999గా నిర్ణయించారు.

**గెలాక్సీ ఎస్26**

ఈ సిరీస్‌లో ఇది బేస్ వేరియంట్. 6.3 అంగుళాల డిస్‌ప్లే, 4,300 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం, 50 ఎంపీ కెమెరా, 2600 నిట్స్, 120 ఊళి రీఫ్రెష్ రేటు వంటి ఫీచర్లు ఉన్నాయి. తెలుపు, నలుపు, నీలం, ఊదా రంగుల్లో అందుబాటులో ఉండనుంది. ప్రారంభ ధర రూ.87,999గా (12ఉః + 256ఉః వేరియంట్) నిర్ణయించారు.ఈ ఎస్26 సిరీస్ ఫోన్లను ప్రీబుకింగ్ చేసుకునే కస్టమర్లకు శాంసంగ్ పలు ఆఫర్లు ప్రకటించింది.

# ఒడుదొడుకుల్లో స్వల్ప లాభాలు

- **ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ. 2,992 కోట్లు**
- **డీఐఐ కొనుగోళ్లు: రూ.5,119 కోట్లు**



**న్యూఢిల్లీ:**ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో, దేశీయ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మన దేశ సోలార్ వస్తువులపై అమెరికా 126% దిగుమతి సుంకాలను విధించడం, మదుపర్ల లాభాల స్వీకరణకు కారణమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 4 పైసలు పెరిగి 90.91 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.14% నష్టంతో 70.67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.74 లక్షల కోట్లు పెరిగి రూ.467.38 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.సెన్సెక్స్ ఉదయం 295 పాయింట్ల (క్రితం ముగింపు 82,225.92) లాభంతో 82,530.12 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ, 82,957.91 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అనంతరం అమ్మకాలతో 82,132.63 పాయింట్లకు పడిపోయిన సూచీ, చివరకు 82,276.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 57.85 పాయింట్లు పెరిగి 25,482.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,428.20– 25,652.60 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.80%, టాటా స్టీల్ 2.63%, టీసీఎస్ 2.14%, ఇండిగో 2.01%, సన్‌ఫార్మా 1.92%, ఎం అండ్ ఎం 1.80%, టెక్ మహీంద్రా 1.13%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.10%, ఇన్ఫోసిస్ 1.08% లాభపడ్డాయి. రిలయన్స్ 2.23%, ఎస్‌బీఐ 1.93%, అదానీ పోర్ట్స్ 1.72%, ఎటర్నల్ 1.46%, భారతీ ఎయిర్‌టెల్ 1.39%, ఐటీసీ 1.22% పడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 2.64%, వాహన 1.82%, ఫోకస్డ్ ఐటీ 1.53%, కమొడిటీస్ 1.49%, ఆరోగ్య సంరక్షణ 1.35% మెరిశాయి. టెలికాం, ఇంధన, ఎఫ్ఎమ్‌సీజీ, స్థిరాస్తి నీరసించాయి. బీఎస్ఈలో 2191 షేర్లు నష్టపోగా, 2012 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 177 షేర్లలో ఎటువంటి మార్పులేదు. ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) రేటింగ్‌ను 'బీబీబీ–'గా ఫిచ్ రేటింగ్స్ కొనసాగించింది. భవిష్యత్తు 'స్థిరం'గా ఉండొచ్చని అంచనా వేసింది.ఐపీఓకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్న ఓయో మాతృసంస్థ ప్రిజం బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా సెబీ మాజీ ఛైర్మన్ అజయ్ త్యాగి నియమితులయ్యారు.

**ఐపీఓ సమాచారం**

పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జువెలరీ ఐపీఓ రెండో రోజుకు 83% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 57,06,235 షేర్లను ఆఫర్ చేయగా, 47,23,424 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 66% స్పందన నమోదైంది.శ్రీరామ్ ట్విస్టెక్స్ ఐపీఓ ముగిసేసరికి 43.66 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 1,06,00,000 షేర్లను ఆఫర్ చేయగా, 46,28,41,632 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 220.30 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 76.63 రెట్లు, క్యూఐబీ విభాగంలో 3.94 రెట్ల స్పందన కనిపించింది. ఐఆర్‌ఎఫ్‌సీ ఓఎఫ్ఎస్‌కు దక్కని పూర్తి స్పందన: ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 2% ప్రభుత్వ వాటా విక్రయానికి సంస్థాగత మదుపర్ల నుంచి పూర్తి స్పందన లభించలేదు. ఓఎఫ్ఎస్‌లో 23.52 కోట్ల షేర్లకు గాను 94.98 శాతానికి సమానమైన 22.34 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. గురువారం రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. 2% వాటాకు మించి స్పందన లభిస్తే, 4% వరకు వాటా విక్రయించాలన్నది ప్రభుత్వ యత్నం.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,48,200 | ₹ 1,61,680 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# సెమాగ్లుటైడ్ రేసులోకి డాక్టర్ రెడ్డీస్




**హైదరాబాద్:** మనదేశంలోనూ మధుమేహం, ఊబకాయ చికిత్సల్లో కీలక మార్పులు చోటుచేసుకోను న్నాయి. ఈ విభాగంలో, ఇప్పటివరకు ఖరీదు ఎక్కువగా ఉన్న మందులు సామాన్యులకూ అందుబాటులోకి రానున్నాయి. బ్రాండెడ్ ఔషధాలపై పేటెంట్, వచ్చే నెల 21తో ముగియనుంది. వీటి ధరల్లో సగాని కంటే తక్కువ ధరకే ఈ ఔషధాలను అందించేందుకు దేశీయ ఔషధ కంపెనీలు సిద్ధమవుతున్నాయి.ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సెమాగ్లుటైడ్ ఔషధాలపై నోవో నార్డిస్క్ సంస్థకు పేటెంట్ హక్కులు ఉన్నాయి. ఈ సంస్థ సెమాగ్లుటైడ్‌ను రెండు బ్రాండ్ల పేర్లతో అమ్ముతోంది. ఇందులో 'ఓజెంపిక్'ను మధుమేహం చికిత్సలో వినియోగిస్తారు. దీని ఖర్చు ఒక రోగికి నెలకు రూ.8,800–రూ.11,175 వరకు ఉంది. బరువు తగ్గించేందుకు కోసం వాడే 'వెగోవీ' ఖర్చు నెలకు రూ.17,000 – 26,000 అవుతోంది. ఎలీ లిల్లీకి చెందిన మౌంజారో వాడాలంటే, నెలకు రూ.14,000–27,500 వరకు వెచ్చించాల్సిందే. ఈ ఔషధాలకు పేటెంట్ గడువు మార్చి 21న ముగియగానే, అదే రోజున డాక్టర్ రెడ్డీస్ తన జనరిక్ ఔషధం 'ఒబెడా'ను ఇంజెక్షన్లు, మాత్రల రూపంలో తీసుకురానుంది. ఇంజెక్షన్‌కు డీసీజీఐ అనుమతి లభించింది కూడా. 1.2 కోట్ల ఇంజెక్షన్ పెన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, గిరాకీకి తగ్గట్టుగా పెంచుకోగలమని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ప్రారంభంలో ఓజెంపిక్‌కు జనరిక్‌గా మధుమేహ చికిత్స కోసం అందుబాటులోకి వస్తుంది. బరువు తగ్గేందుకు ఉపయోగించే ఔషధాన్ని తదుపరి దశల్లో తీసుకొస్తామని డాక్టర్ రెడ్డీస్ ఇటీవల పేర్కొంది. నెలవారీ వినియోగానికి ఈ ఔషధ ధర ప్రస్తుతం కంటే 60% తక్కువగా రూ.1,800 – 6,300 (20–70 డాలర్ల) వరకు ఉండొచ్చని పేర్కొంది. డాక్టర్లు, రోగులకు సహాయం చేసేందుకు స్థూలకాయ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసే యోచనలోనూ డాక్టర్ రెడ్డీస్ ఉంది. రెండేళ్లలో 80కి పైగా దేశాలకు ఈ మందులను ఎగుమతి చేయాలని యోచిస్తోంది.

**15 సంస్థలకు పైగా..**

సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు తీరిన వెంటనే జనరిక్ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు 15కు పైగా భారతీయ ఫార్మా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. మధుమేహం, బరువు తగ్గించే చికిత్సలకు అనుమతి పొందిన సన్ ఫార్మా, నోవెల్‌ట్రీట్, సెమాట్రినిటీ పేర్లతో ఔషధాలు విడుదల చేయనుంది. సిప్లా, జైడస్ లైఫ్‌సైన్సెస్, ఆల్కెమ్ లేబొరేటరీస్ కూడా ఇదే బాటలో ఉన్నాయి. హైదరాబాద్ సంస్థ నాట్కో ఫార్మాతో ఎరిస్ లైఫ్‌సైన్సెస్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ మందులను మార్కెటింగ్ చేయనుంది.

రెట్టింపు పరిమాణంలో..

మధుమేహం, బరువు తగ్గించే మందుల మార్కెట్ 2026 చివరికి ప్రపంచ వ్యాప్తంగా రూ.5.27 లక్షల కోట్ల (58 బిలియన్ డాలర్ల)కు చేరుకుంటుందని అంచనా. ప్రస్తుతం మన దేశంలో ఊబకాయ ఔషధ మార్కెట్ విలువ రూ.1,400 కోట్లు. అందుబాటు ధర జనరిక్ ఔషధాలొస్తే, ఈ మార్కెట్ పరిమాణం ఏడాదిలోనే రెట్టింపు కావచ్చన్నది పరిశ్రమ వర్గాల అంచనా. అయితే దేశీయ ఫార్మా కంపెనీలకు కొన్ని సవాళ్లూ ఉన్నాయి.

# ఈడీ ముందుకు అనిల్ అంబానీ

**ముంబై:**రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరయ్యారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్‌నకు ప్రమేయం ఉన్న రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసులో ఈడీ ఆయనను విచారిస్తోంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి 26న హాజరుకావాలని ఇటీవల ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఈరోజు ఉదయం 10:30 గంటలకు ఆయన సెంట్రల్ దిల్లీలోని ఫెడరల్ దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. కాగా.. బుధవారం అనిల్‌కు చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. దీనివిలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. తాజా వాటితో కలిపి ఈ కేసులో మొత్తం అటాచ్‌మెంట్ విలువ రూ.15,700 కోట్లకు చేరింది. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై ఈడీ కేసు నమోదైంది. వీటి మొత్తం విలువ రూ.40వేల కోట్లుగా పేర్కొంది. దీనిపై గతేడాది ఆగస్టులో ఆయన ఈడీ విచారణకు హాజరయ్యారు.



### అనిల్ అంబానీ రూ.3,716 కోట్ల నివాసం జప్తు



మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. దీని విలువ రూ.3716 కోట్లు. ముంబయిలోని పాలీ హిల్ ప్రాంతంలో ఉన్న ఈ విలాస భవనం 66 మీటర్ల ఎత్తుతో, 17 అంతస్తులను కలిగి ఉంది. ఆర్‌కామ్ చేసిన బ్యాంక్ మోసం కేసులో, పీఎంఎల్ఏ చట్టం కింద ఈ బహుళ అంతస్తుల భవనాన్ని అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తాజా ఆదేశాలతో, ఈ కేసులో మొత్తం అటాచ్‌మెంట్ విలువ రూ.15,700 కోట్లకు చేరింది.

## కంటెంట్‌కు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లదే బాధ్యత

వినియోగించడానికి వీల్లేదన్నారు.నమ్మకం అనే పునాదులపై ఈ సమాజం ఏర్పడిందని మంత్రి అన్నారు. కుటుంబం, న్యాయవ్యవస్థ, మీడియా, శాసనవ్యవస్థలు దీనిపైనే ఆధారపడి పని చేస్తున్నాయని పేర్కొన్నారు. మీడియాలో ధ్రువీకరించిన సమాచారమే పబ్లిష్ చేస్తారని, పైగా ఆ కంటెంట్‌కు బాధ్యత కూడా వహిస్తోందని పేర్కొన్నారు. ఇదేరీతిలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు బాధ్యత వహించాలన్నారు. అలాగే, డీప్‌ఫేక్ రూపంలో నమ్మకం అనే దానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. జరగని విషయాలు కూడా జరిగినట్లుగా కొన్ని వీడియోలు బయటికొస్తున్నాయని, వాటిని ప్రజలు కూడా విశ్వసిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. న్యూస్ పబ్లిషర్లు, కంటెంట్ క్రియేటర్లకు డిజిటల్ మాధ్యమాలు పారదర్శకంగా చెల్లింపులు చేయాలని సూచించారు. లేదంటే న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.

### రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసు..
## ఛార్జ్‌షీట్‌లో నటి రన్యారావు పేరు

**బెంగళూరు:** అక్రమ బంగారం తరలించిన కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు మరిన్ని చిక్కుల్లో పడింది. రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెపై ఆరోపణలు రాగా.. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఆమె పేరు కూడా ఉంది. స్మగ్లింగ్ సిండికేట్ ఒక ఏడాదిలో 127 కిలోల బంగారాన్ని భారత్‌కు స్మగ్లింగ్ చేసిందని ఆరోపణలు వచ్చాయి. తమ హ్యాండ్లర్లు, ఆభరణాల వ్యాపారులు దానిని దేశీయ మార్కెట్‌లోకి చొప్పించారని ఈడీ దర్యాప్తులో గుర్తించింది. దీంతో బెంగళూరులోని పీఎంఎల్ఏ కోర్టులో ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దానిలో రన్యా పేరుతో పాటు ఆమె సహాయకుడిగా భావిస్తోన్న తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన గోల్డ్ డీలర్ సాహిల్ జైన్ పేర్లను చేర్చింది.దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు గతేడాది బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆమె నుంచి 14.7 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాలో కొన్నేళ్లుగా ఆమె ప్రధాన పాత్ర పోషించినట్లు దర్యాప్తులో భాగంగా అధికారులు గుర్తించారు. ఆమె స్మగ్లింగ్ నెట్‌వర్క్‌తో కలిసి పనిచేసిందని వెల్లడించారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసేందుకు భారీ మొత్తంలో కమిషన్ తీసుకునేదని పేర్కొన్నారు. ఈ కేసులో ఆమెకు ఏడాది జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే.

## స్కూల్‌లో ఆడుతూ కుప్పకూలి.. 9 ఏళ్ల బాలికకు కార్డియాక్ అరెస్ట్

**జైపూర్:**రాజస్థాన్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్కూల్‌లో ఆడుకుంటూ కుప్పకూలి ఓ 9 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా గోటన్‌కు చెందిన రాజేంద్ర బపేడియా 9 ఏళ్ల కుమార్తె దివ్య స్థానికంగా ఉన్న ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. ఫిబ్రవరి 23న ఆ బాలిక ఎప్పటిలాగే పాఠశాలకు వచ్చింది. ఉదయం ప్రేయర్‌కు సమయం ఉండటంతో తోటి పిల్లలతో కలిసి స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంది. ఆ సమయంలో దివ్య ఉన్నట్టుండి కుప్పకూలింది. పాఠశాల సిబ్బంది వెంటనే ఆమెను దగ్గర్లోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆ బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, కార్డియాక్ అరెస్ట్ వల్లే మరణించి ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు.కాగా.. కొన్ని నెలల క్రితం దివ్య అన్న అభిషేక్ కూడా ఇలాగే మరణించినట్లు తెలుస్తోంది. గతేడాది సెప్టెంబరులో ఆ బాలుడు ఇంట్లో ఆడుకుంటూ కుప్పకూలాడు. ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే ప్రాణాలు కోల్పోయాడు. నెలల వ్యవధిలో చిన్నారులిద్దరూ మరణించడంతో రాజేంద్ర కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



## అరుదైన భూఖనిజాల వెలికితీతకు 7 క్షేత్రాల గుర్తింపు
### ఎస్ఈసీఎల్

**న్యూఢిల్లీ:**అరుదైన భూఖనిజాల అన్వేషణ నిమిత్తం 7 గనుల డంప్‌లను గుర్తించినట్లు కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన సౌత్ ఈస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) తెలిపింది. బొగ్గు గనుల వ్యర్థాలను పునర్వినియోగించుకోవాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల్లో భాగంగా ఎస్ఈసీఎల్ దీనిని చేపట్టింది. ప్రధాన బొగ్గు క్షేత్రాల్లోని డంప్‌ల్లో, అరుదైన భూఖనిజాల లభ్యతకు అవకాశం ఉందని గుర్తించామని, వీటిని వెలికితీసే నిమిత్తం ఇప్పటికే టెండర్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఎస్ఈసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు హరీశ్ దుహన్ తెలిపారు. సాంకేతికతను ఉపయోగించి వచ్చే సంవత్సరంలోగా లోహాల లభ్యతకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన ప్రాంతాలను గుర్తించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక విద్యుత్, రక్షణ, వాహన, విమానయానం లాంటి రంగాలకు భూఅయస్కాంత ఖనిజాల అవసరం ఉంది. ప్రస్తుతం వీటి కోసం చైనా మీద భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది.



# మన 'సోలార్'పై అమెరికా 126% సుంకం

- **సహేతుకం కాని సబ్సిడీలు ఇస్తున్నందునే: యూఎస్ వాణిజ్య శాఖ**
- **పరిమిత ప్రభావమే అంటున్న కంపెనీలు.. స్టాక్ మార్కెట్లో కుదేలైన సోలార్ షేర్లు**




**న్యూఢిల్లీ:**మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న కొన్ని సౌర విద్యుదుత్పత్తి వస్తువులపై అమెరికా 125.87% ప్రాథమిక కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని (సీవీడీ) ప్రకటించింది. భారత్ ఆయా వస్తువులపై సహేతుకం కాని రీతిలో సబ్సిడీలు ఇవ్వడమే ఇందుకు కారణమంది. ఇండొనేషియా, లావో పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్ (లావోస్) నుంచి వచ్చే క్రిస్టలిన్ సిలికాన్ ఫొటోఓల్టాయిక్ సెల్స్‌పైనా వేర్వేరు సుంకాలను అమెరికా ప్రకటించింది. 2026 జులై 6 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని అధికారిక ఉత్తర్వు పేర్కొంది. అమెరికాలోకి 2022లో 83.86 మి. డాలర్లు (సుమారు రూ.755 కోట్లు)గా ఉన్న భారత సౌర దిగుమతులు, 2024లో 792.6 మి. డాలర్లు (దాదాపు రూ.7100 కోట్లు)గా నమోదయ్యాయి.ఏమిటీ సుంకం: తయారీ దేశంలో సబ్సిడీలు పొందితే, ఆయా వస్తువులను తక్కువ ధరలకే ఎగుమతి చేసేందుకు కంపెనీలకు వీలవుతుంది. ఫలితంగా దిగుమతి చేసుకునే దేశంలోని కంపెనీల ఉత్పత్తుల కంటే, తక్కువకే లభిస్తాయి. ఇటువంటి సందర్భంలో తమ కంపెనీలను రక్షించుకోవడానికి, దిగుమతి చేసుకునే దేశాలు కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని విధిస్తుంటాయి.పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు, చైనా నుంచి దిగుమతులను తగ్గించేందుకు మనదేశం పలు చర్యలు చేపట్టింది. సోలార్ మాడ్యూళ్లు, సోలార్ పీవీ సెల్స్, ఇన్‌గాట్స్, వేఫర్ల వంటి కీలక విడిభాగాల దేశీయ తయారీని ప్రోత్సహిస్తోంది. రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్, ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవమ్ ఉత్తన్ మహాభియాన్ (పీఎమ్–కుసుమ్) స్కీమ్, సీపీఎస్‌యూ స్కీమ్ ఫేజ్–2 వంటి పథకాల కింద తప్పనిసరిగా దేశీయ తయారీ ప్యానెల్స్, సెల్స్‌నే వాడాలి. దిగుమతులపై 2022 ఏప్రిల్‌లో ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మనదేశం విధించింది. అధిక సామర్థ్యం ఉండే సోలార్‌ఫొటో ఓల్టాయిక్ మాడ్యూళ్ల తయారీని ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కిందకు తీసుకొచ్చారు. ఫలితంగా 2024–25లో చైనా నుంచి దిగుమతులు 1.7 బి. డాలర్లకు తగ్గాయి. 2023–24లో ఇవి 2.85 బి. డాలర్లుగా ఉన్నాయి. వియత్నాం, హాంకాంగ్, మలేషియా, సింగపూర్ నుంచి కూడా సౌర ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. మన ప్రభుత్వ ప్రోత్సాహకాలు వినియోగించుకుని, దేశీయ కంపెనీలూ ఎగుమతి చేస్తున్నాయి.అమెరికా నిర్ణయం వల్ల తమపై పరిమిత ప్రభావమే ఉంటుందని విక్రమ్ సోలార్, వారీ ఎనర్జీస్, ప్రీమియర్ ఎనర్జీస్ వంటి కంపెనీలు చెబుతున్నాయి. 'భారత్‌లో తయారైన సెల్స్‌పై అమెరికా సుంకాలు వర్తిస్తాయి. అమెరికాకు పంపే ఆర్డర్లను భారత సెల్స్‌తో మేం పంపడం లేదు. తక్కువ టారిఫ్‌లుండే ఇతర దేశాల నుంచి వాటిని సమకూర్చుకుంటున్నాం. కాబట్టి మాపై ప్రభావం అంతగా ఉండద'ని విక్రమ్ సోలార్ అంటోంది. మనదేశ ఉత్పత్తులపై 50% సుంకం ఉన్నపుడూ, అమెరికాకు డెలివరీ చేశామని, అమెరికా ఆర్డర్లను పూర్తి చేయడంపై ప్రభావం ఉండబోదని వారీ ఎనర్జీస్ తెలిపింది. అమెరికాకు ఎగుమతులు చేయనందున, తమపై ప్రభావమూ ఉండదని ప్రీమియర్ ఎనర్జీస్ పేర్కొంది. తాజా పరిణామాల నేపథ్యంలో బీఎస్ఈలో సౌర కంపెనీల షేర్లు చతికిలబడ్డాయి. ఒక దశలో 15% వరకూ నష్టపోయినా తర్వాత కాస్త కోలుకున్నాయి. ఏ షేరు ఎంత కోల్పోయిందంటే..

95% ఎగుమతులు అమెరికాకే..

2023 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు మధ్య అమెరికాకు రూ.34,000 కోట్ల విలువైన సెల్స్, మాడ్యూళ్లు మనదేశం నుంచి ఎగుమతి అయ్యాయి. అమెరికాలో తయారైన మాడ్యూళ్లతో పోలిస్తే మన ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉండడం ఇందుకు నేపథ్యం. గత 3 త్రైమాసికాల్లో భారత సోలార్ సెల్స్, మాడ్యూళ్ల ఎగుమతుల్లో 95 శాతానికి పైగా అమెరికాకే వెళ్లాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సెహుల్ భట్ అంటున్నారు.

# పంచాయతీ కార్యదర్శి రాడు..
# ఇన్‌చార్జి ఇవ్వలేదు



## పెంటాకుర్దు పంచాయితీపై జిల్లా అధికారుల మౌనమేల..?

- గ్రామ అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి
- 20 రోజులుగా కార్యదర్శి రాక ఉపాధి హామీ, గ్రామసభలకు ఇబ్బంది
- జిల్లా అధికారుల మౌనంపై గ్రామస్తుల ఆగ్రహం

**బోధన్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** బోధన్ మండలం పెంటాకుర్దు గ్రామపంచాయతీపై అధికారుల మౌనంతో గ్రామంలోని అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని గ్రామస్తులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. గత 20 రోజుల నుంచి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాకపోవడంతో అధికారులు కనీసం పక్క పంచాయతీ కార్యదర్శికి అయినా ఇన్‌చార్జి ఇచ్చిన పాపాన పోలేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. గ్రామంలో ఇటీవల ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శి లేకుండానే మమ అనిపించాల్సి వచ్చింది. అంతేకాకుండా గ్రామస్తుల కనీస అవసరాలైన తాగునీటి సరఫరా, మురికి కాలువల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులకు ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గత 20 రోజుల కిందట గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో బిల్ కలెక్టర్ బాబు మరణించిన విషయం తెలిసిందే. అయితే అప్పటినుంచి గ్రామ కార్యదర్శి లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అయితే సంఘటన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు కార్యదర్శి అధికారులకు సమాచారం అందించారా లేదా అనే విషయం సైతం ఎవరికి క్లారిటీ లేదు. కనీసం దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నానని ఓ లెటర్ రాసి అధికారులకు అందించినట్లయితే సదరు అధికారులు ఇతర కార్యదర్శులకు ఇన్‌చార్జి అప్పగించే అవకాశం ఉందని గ్రామస్తులు అనుకుంటున్నారు. సంఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శి గ్రామంలో అడుగుపెట్టిన దాఖలాలు లేవని దాంతో తమ గ్రామానికి సంబంధించిన సమస్యలను, అభివృద్ధి పనులను, లావాదేవీలను ఎవరికి చెప్పుకోవాలో ఎవరికి అందించాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా బోధన్ మండల అధికారులు స్పందించి పెంటాకుర్దు గ్రామపంచాయతీకి కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కార్యదర్శి చార్జి విషయంలో జాప్యం : ఎంపీఓ యెల్లం వేణు

ఈ విషయమై బోధన్ మండల ఎంపీవో యెల్లం వేణును జనం సాక్షి వివరణ కోరగా, పెంటాకుర్దు గ్రామ పంచాయతీకి తాత్కాలికంగా కార్యదర్శిని నియమించడంలో ఆలస్యమైందని స్పష్టం చేశారు. అయితే ఖండ్‌గావ్ కార్యదర్శి రాజీవ్ గాంధీకి బాధ్యతలు అప్పగించడం జరిగిందని ఆయన వివరించారు.

# చేసిన పనికి కూలీ ఇవ్వకుండా బండికి 2800 అక్రమ వసూళ్లు

- ఏషియన్ పెయింట్ ట్రాన్స్‌పోర్ట్ యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- గత 10 ఏళ్లుగా లక్షల రూపాయల దోపిడీ
- సమ్మె చేస్తున్న కార్మికులను విచ్ఛిన్నం చేసే కుట్రలు
- కార్మిక శాఖ అధికారి నిర్లక్ష్యం.. యజమానుల పక్షపాతం : సీపీఎం, సీఐటీయూ



**కరీనగర్ టౌన్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** ఏషియన్ పెయింట్‌లో గత 10 సంవత్సరాలుగా హమాలీ పని ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లతో చేపించుకుని డబ్బులు ఇవ్వకుండా లక్షల రూపాయలు దోపిడీ చేసిన పెయింట్ యజమాన్యం, ట్రాన్స్‌పోర్టర్ గంప వెంకట్ లాజిస్టిక్, దుబ్బ భూషణం ట్రాన్స్‌పోర్ట్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ కమిషనర్‌లను డిమాండ్ చేశారు. చేసిన పనికి డబ్బులు ఇవ్వకుండా ప్రతి ట్రాన్స్‌పోర్ట్ బండిమీద 2800 చొప్పున అక్రమంగా బండి యజమానుల నుంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఈ దోపిడిని తట్టుకోలేక అప్పుల పాలవుతున్న ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, ఓనర్లు సమ్మె చేస్తుంటే సమ్మె చేస్తున్న కార్మికులను సమస్యలపై చర్చించకుండా ట్రాన్స్‌పోర్ట్ ఓనర్ విదేశాల్లో ఉన్నారన్న కారణం చెబుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సమ్మె చేస్తున్న కార్మికుల కోసం పని చేయాల్సిన జిల్లా కార్మిక శాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మిక చట్టం ప్రకారం పని చేయించుకుని డబ్బులు ఇవ్వని యజమానులపై డీసీఎల్ ఎందుకు కేసు నమోదు చేయట్లేదని ప్రశ్నించారు. కార్మిక శాఖ అధికారులు కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారా లేక యజమానుల కోసమా అని తేల్చుకోవాలని, యజమానుల కోసమే పనిచేయదలుచుకుంటే కార్మిక శాఖ అధికారి తమ బోర్డును మార్చుకొని యజమానుల అధికారిగా నామకరణం చేసుకోవాలని వ్యంగ్యంగా అన్నారు. ఇప్పటికైనా కార్మిక శాఖ అధికారులు పక్షపాతం లేకుండా ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఈ ఐదు సంవత్సరాల కాలంలో హమాలీ పని చేపించుకొని కూలీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ట్రాన్స్‌పోర్ట్ బండి పెట్టుకున్నందుకు ఒక బండి నుంచి 2800 చొప్పున వసూలు చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ యజమానులపై జిల్లా పోలీస్ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. న్యాయంగా చట్టబద్ధంగా సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లు నెరవేర్చి సమ్మెను విరమింపచేసి ప్రశాంతత చేసే విధంగా యజమానులపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమ్మెకు మద్దతుగా ఈ దోపిడిదారులపై చర్యలు తీసుకునేంతవరకు జిల్లావ్యాప్తంగా కార్మిక కర్షకులు అందరినీ ఐక్యం చేసి సంఘటిత ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ, జిల్లా కార్యదర్శి ముకుంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి, సంఘం గౌరవ అధ్యక్షులు పున్నం రవి, యూనియన్ కోశాధికారి వెంకటేష్, ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, నాయకులు కే మహేష్, ఏ రమేష్, వెంకటేష్, శ్రీనివాస్, మధు, కళాధర్, శ్రీకాంత్, విజయ్ కుమార్, రాజు, మోహన్ మరియు 30 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

## హుజురాబాద్ మున్సిపాలిటీ
# కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

- హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గళం విప్పండి
- డంపు యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**హుజురాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం గళం విప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బీజేపీ కౌన్సిలర్లకు సూచించారు. హుజురాబాద్ మున్సిపాలిటీ కి ఎన్నికైన నూతన కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. ఈ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. హుజురాబాద్ పట్టణ అభివృద్ధి కోసం బిజెపి కౌన్సిలర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ అధికార పగ్గాలు కాంగ్రెస్ కు పట్టణ అభివృద్ధి పట్ల తగిన చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల అయినా హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రతిపక్ష స్థానంలో బిజెపి కౌన్సిలర్లే ప్రజలకు బాటగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం, పట్టణాభివృద్ధి కోసం నిరంతర కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హుజురాబాద్ మున్సిపాలిటీ శివారులో (సిరసపల్లి గ్రామం) డంపు యార్డు ఏర్పాటు ప్రతిపాదన ను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మూడు ఉమ్మడి జిల్లా పరిధిలోనీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సంబంధించిన మొత్తం చెత్తను ఇక్కడి ప్రాంతానికి తరలిస్తే హుజురాబాద్ భవిష్యత్తుకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉందన్నారు. నేషనల్ హైవేకు, హుజురాబాద్ మున్సిపాలిటీ శివారులో,సిరసపల్లి గ్రామం వద్ద దంపు యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రజలను, హుజురాబాద్ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దంపు యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విరమించుకోక పోతే ప్రజా పోరాటం తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుజరాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, కౌన్సిలర్లు కోలుగురి సుమలత, సుమన్, దామెర అనూష అనురాగ్, పంజాల మనోజ్, తూర్పాటి లక్ష్మి దుర్గ రాజు, కొండ ప్రశాంతి మురళి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వెలుగుమట్ల బాధితులకు ఎంపీ రవిచంద్ర భోజనాలు

**ఖమ్మం టౌన్ ఫిబ్రవరి, 26 (జనంసాక్షి) :** ఖమ్మం నగర శివారు వెలుగు మట్లలోని భూదాన్ బోర్డ్ భూమిలో ప్రభుత్వం తొలగించిన గుడిసెలు, నిరాశ్రయులైన బాధితుల పరామర్శ కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఖమ్మం పర్యటనకు విచ్చేశారు. యువనేత కేటీఆర్‌కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు.. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వెలుగుమట్ల లో నిరాశ్రయులైన బాధితులు తమ గుడిసెల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేటీఆర్ పర్యటనలో స్వల్ప ఆలస్యం అవ్వడంతో బాధితులంతా ఆకలి, దప్పికతో అలమటిస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అప్పటికప్పుడు సుమారు 600 మంది బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు భోజనాలు లేక అలమటిస్తున్న తరుణంలో ఘటనా స్థలిలో భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ రవిచంద్రకు ఋణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గంజాయి విక్రయిస్తున్న నలుగురి ముఠా అరెస్ట్

## నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** జుబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, లాలాగుడా పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక దాడిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తుల ముఠాను అరెస్ట్ చేసి, నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు రూ.2 లక్షల విలువైన 4 కేజీల ఎండు గంజాయి, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన నాగేశ్వరరావు కెల్లో అలియాస్ నాగేష్ (25) గంజాయి సరఫరాదారుగా వ్యవహరిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతను అదే ప్రాంతానికి చెందిన సాయిబా గొలోరి అలియాస్ శివ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని, అతని సూచనల మేరకు వివిధ ప్రాంతాలకు గంజాయి సరఫరా చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో నాగేశ్వరరావు ట్రావెల్స్ బస్సులో గంజాయిని తీసుకుని సికింద్రాబాద్ చేరుకున్నాడు. మెట్టుగూడ రైల్వే హాస్పిటల్ సమీపంలో తిరుమలగిరికి చెందిన హర్దీప్ సింగ్(47) అనే విక్రేతకు గంజాయి ప్యాకెట్లు అందజేస్తు ఒడగా, మౌలాలీ ప్రాంతానికి చెందిన ప్రియాంత్ విజయ్ అలియాస్ చింటూ (34) మరియు అల్వాల్ ప్రాంతానికి చెందిన గంధం గోవర్ధన్ అలియాస్ చిన్నా (37) అనే ఇద్దరు వినియోగదారులు అక్కడికి చేరుకున్నారు. ఈ సమాచారంపై ముందుగానే అప్రమత్తమైన టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్ ను వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. యదేందర్, జుబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ డి. రవిరాజ్, సిబ్బందితో కలిసి లాలాగుడా పోలీసులు విజయవంతంగా నిర్వహించారు.

# అన్ని వర్గాలకోసం పరితపించే వ్యక్తి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం
- కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు చెక్కుల పంపిణీ చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- నూతన కౌన్సిలర్లను సన్మానించిన ఎంపీ





**మొయినాబాద్, ఫిబ్రవరి 26, జనం సాక్షి :** అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకను గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధి లోని అంజనీదేవి గార్డెన్‌లో ఘనంగా జరిగాయి. ముందుగా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ కూడలిలోని డాక్టర్.బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొయినాబాద్ లోని అంజనీదేవి గార్డెన్ లో నిర్వహించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మొయినాబాద్ మండల, మున్సిపల్ బీజేపీ నాయకులతో కలిసి ఎంపీతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఇలాంటి మంచి వ్యక్తి చేవెళ్ల ఎంపీగా ఉండడం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ప్రజల అదృష్టమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. ఎక్కడ సమస్య ఉన్న పరిష్కరించే కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు సేవా చేసేంత శక్తి భగవంతుడు ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా జన్మదిన సందర్భంగా పేద విద్యార్థులు 2500 రూపాయల చెక్కును 1500 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయంగా చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ ఎన్నికలో బీజేపీ పార్టీ నుండి పోటీ చేసి గెలిచిన నూతన కౌన్సిలర్లు షాబాద్ కిషన్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్, జగపతి, పడమటి మమతా మోహన్ రెడ్డిలను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా ప్రజలకు కౌన్సిలర్లు అందుబాటులో ఉండి మంచిపాలన అందించాలన్నారు. నా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మహేశ్వరం ఇన్చార్జి శ్రీరాములు, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, గున్నాల గోపాల్ రెడ్డి, మోర నరసింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, మొయినాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు షాబాద్ కిషన్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్, పడమటి మమతా మోహన్ రెడ్డి, జగపతి, బాకారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్, శ్రీరామ్ నగర్ సర్పంచ్ ఏర్పుల గీత మహిపాల్, మేడిపల్లి సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్, రెడ్డిపల్లి సర్పంచ్ షాపూరం రాజు, బీజేపీ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు మామిడి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత రెడ్డి, డాక్టర్.వైభవ్ రెడ్డి బీజేపీ జిల్లా యువ నాయకులు మరియు వివిధ మండలాల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పరీక్షలకు వేళాయే ట్రాఫిక్ చలాన్ల దందాయే

- ట్రాఫిక్ చాలాన్ల రూపంలో తల్లిదండ్రులకు బాదయే...
- పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రుల బండ్లు ఆపి చలాన్లు రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- టిఆర్‌పి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్



**హయత్ నగర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు సెవాభావంతో తమ వంతు సహకరించుకోవాలని ఎల్ బి నగర్ నియోజకవర్గం ఇంచార్జి, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. పరీక్ష కేంద్రాలకు వెళ్ళేటప్పుడు విద్యార్థులు బండి లిఫ్ట్ అడిగిన ఏదైనా వస్తువు మర్చిన వాహనదారులు విద్యార్థులకు సహాయం చేయాలనివారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను ఐదు నిముషాలు ఆలస్యం అయినా అనుమతించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాలకు తమ పిల్లలను దూర ప్రాంతశీ నుండి తీసుక వచ్చే విద్యార్థుల ప్రయాణశీ దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీసులు తల్లిదండ్రులకు సహకరించాలని వారు కోరారు. కాని కొందరు ట్రాఫిక్ పోలీసులు అతి ఉత్సాహంగా తల్లిదండ్రులను బండి ఆఫి ఆర్ సి, లైసెన్స్, హెల్మెట్, ఇన్సూరెన్స్ ఉన్నదా అని ట్రాఫిక్ పోలీసులు నడిరోడ్డు పైనే బండి ఆపి చాలాన్లు రాస్తు ఇబ్బందులకు గురించేస్తున్నారని, తల్లిదండ్రులు తెలంగాణ రాజ్యాధికారం పార్టీ హెల్ప్ లైన్ కీ ఫోన్ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరి పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి ట్రాఫిక్ పోలీసులు బండి ఫోటోలు తీసి చలాన్లు ఇంటికి పంపిస్తున్నారని అంటున్నారు. మేము మా పిల్లలు పరీక్షలు ఎలా రాస్తున్నారో అని ఒక వైపు ఆలోచన చేస్తుంటే పరీక్ష కేంద్రం దగ్గర ఉన్న బండ్ల వద్దకి వచ్చి చలాన్లు రాస్తున్నారని వారు తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కి అర్హత లేకున్నా, ఫోటోలు తీసి తమ అధికారుల మెప్పుకోసం ప్రభుత్వ ఖజానా నింపడం కోసం ట్రాఫిక్ పోలీసులు చలాన్ల రూపేనా ప్రజలను ఇబ్బందులకు గురించేస్తున్నారని వారు అన్నారు. ఇలాంటి పద్ధతి మంచిది కాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను వారు హెచ్చరించారు.

# మున్సిపాలిటీ సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి





- అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో కృషి చేయాలి
- విద్యుత్, మంచినీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- తాగునీటికి శాశ్వత పరిష్కారం.. నిధులు మంజూరు చేస్తాం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : మంత్రి శ్రీహరి

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :**

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడలు, యువజన శాఖల మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశించారు. గురువారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కొత్తగా ఎంపికైన వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సిబ్బందితో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్య, మంచినీటి సమస్య, పారిశుధ్యం సమస్యలు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో సాయంత్రం 6 గంటలకు వీధి దీపాలు వెలగాలని, ఉదయం 6 గంటలకు ఆఫ్ కావాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో వీధి దీపాలు వెలగడం, రాత్రి వీధి దీపాలు వెలగకపోవడం వంటి సమస్యలు లేకుండా చూడాలని, అందుకు అవసరమైన విద్యుత్ సామగ్రి అడిగితే వెంటనే మంజూరు చేయిస్తానని అన్నారు. లో వోల్టేజ్ ఇబ్బంది ఎక్కడ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఒక్కో వార్డు ఆఫీసర్‌ను వార్డులో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. తాగునీరు సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వారం వార్డు ఆఫీసర్లు, కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైన్‌లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వీడాలని, దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆత్మకూరులో ఇప్పటికే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని పూర్తి అయితే మరో 152 ఇళ్లు మంజూరు చేస్తానని తెలియజేశారు. అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులకు తమ పనిమీద పట్టు లేకుంటే మాత్రం చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్ పర్సన్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శశిధర్, కొత్తగా ఎంపికైన మున్సిపల్ కౌన్సిలర్లు, తహసిల్దార్ చాంద్ పాషా, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటిజం, పిల్లల అభివృద్ధి కేంద్రాలకు ప్రభుత్వ నమోదు తప్పనిసరి

### జిల్లా సంక్షేమ అధికారి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం దివ్యాంగు లకు సేవలు అందిస్తున్న ఆటిజం మరియు పిల్లల అభివృద్ధి కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వంలో నమోదు చేసుకోవాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. చట్టంలోని విభాగం–51 ప్రకారం దివ్యాంగులకు సేవలు, చికిత్స, శిక్షణ, పునరావాసం, సంరక్షణ లేదా మద్దతు అందించే అన్ని సంస్థలు సంబంధిత అధికారుల వద్ద నమోదు పొందడం అనివార్యమని పేర్కొన్నారు. అయితే జిల్లాలో కొన్ని కేంద్రాలు అవసరమైన అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. అటువంటి సంస్థలన్నీ వెంటనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో నమోదు కోసం దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. చట్టంలోని నిబంధనలను పాటించని కేంద్రాల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే నమోదు లేని కేంద్రాలను మూసివేయడం, స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు కూడా చేపట్టబడతాయని స్పష్టం చేశారు. అందువల్ల సంబంధిత సంస్థలు ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి విజ్ఞప్తి చేశారు.

# కళాశాల భూముల కబ్జాలపై ఆగ్రహం

- రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థి నాయకుల అరెస్టు
- ఎమ్మెల్యే రమణారెడ్డిపై ఆరోపణలు
- భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం



**కామారెడ్డి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించాల్సిన ఈ సమావేశాన్ని లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల పేరుతో నిలిపివేసి, విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యలను విద్యార్థి నాయకులు తీవ్రంగా ఖండించారు. 1964లో ఏర్పడిన కాలేజీ ఎడ్యుకేషన్ సొసైటీకి రైతులు చెమటోడ్చి, రక్తపు బొట్టుతో కూడబెట్టిన 268 ఎకరాల భూమిని అప్పగించారని, అయితే సొసైటీ సభ్యులు భూములను కాపాడలేకపోయారని విద్యార్థి నాయకులు ఆరోపించారు. సొసైటీ సభ్యులుగా ఉన్న సమయంలోనే భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి సభ్యుడిగా, ఆయన తండ్రి కె.పి. రాజిరెడ్డి కార్యదర్శిగా ఉన్న కాలంలోనే అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

అరోరా ఇంజనీరింగ్ కాలేజీకి 26 ఎకరాల భూమి అప్పగించడంలో ఎమ్మెల్యే రమణారెడ్డి కీలక పాత్ర వహించారని, అరోరా యాజమాన్యం ఇప్పటివరకు ఒక్క పైసా అద్దె కూడా చెల్లించలేదని, పైగా కేసులు వేసి భూమి మాదేనని చెప్పడం దురదృష్టకరమని విమర్శించారు. అదే విధంగా శిశు మందిర్ పాఠశాలకు రెండు ఎకరాల భూమిని అక్రమంగా లీజుకు ఇచ్చారని, ఈ వ్యవహారాలన్నింటికీ అప్పటి సొసైటీ సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే రమణారెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

రైతుల కష్టార్జితమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జా చేయనివ్వమని, కళాశాల భూముల పేరుతో జరిగిన అవినీతిని ప్రజల ముందు బహిర్గతం చేస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు. కబ్జాకు గురైన ప్రతి ఎకరం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కామారెడ్డి, పరిసర గ్రామాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ భూములను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని వెల్లడించారు. పోలీసుల ముందస్తు అరెస్టులతో సమావేశం నిలిచిపోయినా ఉద్యమ స్ఫూర్తి మరింత బలపడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరాన్ని అణచివేయలేరని, ఇది కేవలం భూముల కోసం కాదు, విద్యా హక్కు, భవిష్యత్ తరాల కోసం జరుగుతున్న ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆజాద్, సందీప్ కుమార్, ఎన్ఐవీయం విఠల్, అరుణ్, లక్ష్మణ్, నాగరాజు, భారత్, వినోద్, వినయ్, సోఫియన్, డేవిడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### కళాశాల ఆస్తుల అన్యాక్రాంతంపై కలెక్టర్ శ్వేత పత్రం విడుదల చేయాలి : ఏబీవీపీ

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల వివరాలపై కలెక్టర్ శ్వేత పత్రం విడుదల చేయాలని, తప్పుడు ఆరోపణలు చేసి విద్యార్థుల సమయాన్ని, సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. 1964లో అందించిన 268 ఎకరాల 4 గుంటల భూమిలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు ఎన్ని ఎకరాలు కేటాయించారో సర్వే నంబర్లతో సహా వివరాలు మీడియా సాక్షిగా ప్రకటించాలని కోరారు. 2021లో చేపట్టిన సర్వే వివరాలు, అక్రమ కబ్జాలపై చర్యలు, కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు చరణ్, విభాగ్ కన్వీనర్ శశి, టౌన్ సెక్రటరీ సంజయ్, విష్ణు, కౌశిక్, అజార్ పాల్గొన్నారు.



### ఓట్లు, సీట్లే ముఖ్యం కాదు...ప్రజా సమస్యలపై

# నిరంతర పోరాటాలే మా లక్ష్యం

**మతోన్మాదాన్ని ఎదిరిస్తాం, బిజెపిని నిలువరిస్తాం : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

**కరీంనగర్ టౌన్ (జనంసాక్షి) :** ప్రస్తుత ఎన్నికల్లో డబ్బు,మద్యం, ఏరులై పారుతుందని, కార్పొరేట్ శక్తులు వ్యాపారులు ఎన్నికల్లో పాల్గొని ధన ప్రభవాన్ని చూపెడుతూ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని, జై కిసాన్ అంటూనే 1200 మంది రైతులను నిర్దాక్షిణ్యంగా చంపారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా లేబర్ కోడులను మార్చి కొత్తగా నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చారని, వామపక్షాలు పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రామ్ జీ పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీడియం చేస్తున్నారని అన్నారు. ఎవరైనా తప్పు చేస్తే శిక్షించడానికి కోర్టులు ఉన్నాయని అలాకాకుండా అర్బన్ నక్సలైట్లను చంపేస్తామని అనడానికి అతను ఎవరని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు రాజకీయ పార్టీ పెడితే స్వాగతిస్తామని, ఆ రాజకీయ పార్టీ వర్గ దోపిడీకి అసమానతలకు, వ్యతిరేకంగా కార్మికులు కష్టజీవులు ప్రజల పక్షాన పోరాడితే కలిసి పని చేయడానికి అభ్యంతరం లేదని అన్నారు. రాష్ట్రంలో నగర్‌కర్నూల్ జిల్లాలో కుల రక్కసి కోరల్లో పసిపాప బలైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించి ,బాధితులకు సరైన న్యాయం చేయాలని, రాష్ట్రంలో కుల దురంకార హత్యలు అరికట్టాలని అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూలి బండి సంజయ్ బిజెపికి మేయర్ పదవి ఇస్తే డంపింగ్ యార్డ్ ను తరలిస్తామని ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు దండుకోవడం చూస్తుంటే గత తొమ్మిది సంవత్సరాలుగా కరీంనగర్ ఎంపీగా ఉండి డంపింగ్ యార్డ్ ను ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసం కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయపదం గడుపుకుంటున్నారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎస్ రమ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడి కందుల సత్యం, జి.బీమా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2026 పోస్టర్ రిలీజ్ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :**

కరీంనగర్ లో గురువారం రోజు వికసిద్భారత్ కరీంనగర్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు గాను పోస్టర్ని సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్ రిలీజ్ చేశారు. సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ఎమర్జెన్సీపై తమ అభిప్రాయాలను ఆలోచనలను రాజ్యాంగబద్ధంగా ఏర్పడే పరిస్థితులను సవివరంగా వ్యక్తపరచాలని విద్యార్థులను ఉద్దేశించి కోరారు. వికసిద్భారత్ 2026 జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలను 18 నుండి 25 సంవత్సరాల వయసు గల యువతి యువకులకు “50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ” అనే విషయం పై మూడు నిమిషాల పాటు హిందీ ,ఇంగ్లీష్ ,తెలుగు భాషలలో మాట్లాడడానికి అవకాశం కల్పించారు. ఈ జిల్లాస్థాయి పోటీలకు ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 28 ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్, ప్రొ ఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేవారు ముందుగా మై భారత్ పోర్టల్ లో వికసిద్ భారత్ ఈవెంట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. టిజిసి జిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... గత సంవత్సరం మాదిరిగానే విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వ్యక్తపరచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ జిల్లా అధికారి ఎం. వెంకట రాంబాబు మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కరీంనగర్ జిల్లా పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లేలా తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. విద్యార్థులంతా నిస్సంకోచంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి.నితిన్ పాఠక్, టి. రాజయ్య, వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల సమన్వయకర్త బి. ఎలిజబెత్ రాణి అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్, డాక్టర్ కె. అర్జున్, వెంకటేశ్వర్లు, రాజేందర్ రాజేష్ తదితర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ బల్దియా చైర్మన్, వైస్‌చైర్మన్ బాధ్యతల స్వీకరణ

- ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేషన్ చైర్మన్లు, ప్రతినిధులు, ఇంచార్జి నాయకులు



**ఆర్మూర్ ఫిబ్రవరి 26 (జనంసాక్షి):**

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ గా గోనె లహరి రఘు, వైస్‌చైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణంతో పూజలు నిర్వహించి ఆశీస్సులు అందించారు. మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పదవి స్వీకరణలో భాగంగా మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ లచే సంతకాలు చేయించి బాధ్యతలు అప్పగించారు.మున్సిపల్ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొనగా బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు.ఈ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరావత్రి అనిల్,తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హందాన్,రాష్ట్ర అధికార ప్రతినిధి ఏబి చిన్న, ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి హాజరై వారి ఆశీర్వచనాలు అందించారు.మున్సిపల్ చైర్మన్ గోనె లహరి రఘు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు.ప్రజలకు నిజమైన, నిబద్ధతతో ఉండి మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు.తదనంతరం మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే కార్మికులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ హయాంలో బీసీలకు ప్రాధాన్యం.. ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.జిల్లాలోని బోధన్,ఆర్మూర్,భీమ్గల్ బీసీ మహిళలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు.రాష్ట్రంలో 64శాతం వరకు బీసీలకు బల్దియా పీఠాలను అప్పజెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆర్మూర్ ప్రజలు ఇతర పార్టీలను తిరస్కరించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు.బీసీ పద్మశాలి బిడ్డను ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్‌గా చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు.

# ఫోన్ యాప్‌లో అవగాహన లేక రైతన్నల కష్టాలు

- వచ్చిన ఐదు నిమిషాల్లో బుకింగ్ పూర్తి
- ఫర్టిలైజర్ షాప్ చుట్టూ రైతన్నలు



**గంభీరావుపేట ఫిబ్రవరి 26 (జనం సాక్షి);**

రైతన్న కష్టాలు అంతా ఇంతా కాదు స్మార్ట్ ఫోన్ తో యూరియా బుకింగ్ కాకపోవడంతో అన్నదాతల కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అన్నదాతలకు యాప్ కష్టాలు అవగాహన లేకపోవడంతో అవసరమై న వారికి యూరియా అందడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వరి,పంటలు సాగు చేసిన రైతులు కొందరికి స్మార్ట్ ఫోన్లు లేక, మరికొందరికి పట్టాదారు పాస్‌బుక్‌కు మొబైల్ నెంబర్ లింక్ చేసుకోకపోవడంతో ఎరువు దొరకని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ శాఖ అధికారులు యాప్‌లో యూరియా ఎలా బుక్ చేసుకోవాలో అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. యూరియా రావడంతో పది నిమిషాల్లో 420 బస్తాలు బుక్ అయిపోతున్నాయి. తెలియని రైతులు ఎలా బుక్ చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తెలిసిన వారు బుక్ చేసిన కానీ షాపుల నుంచి కానీ సొసైటీ నుంచి యూరియా తీసుకుపోవడం లేదు. అవసరమైన రైతులకు మాత్రం యూరియా దొరకడం లేదు. ఏం చేయాలో ఎలా చేయాలో తెలియక తలలు బాదుకుంటున్నారు. ఈ యాప్ ను గతంలో మాదిరిగా ఇవ్వాలని రైతుల కోరుతున్నారు.



# రైతులు అధైర్య పడవద్దు

- అకాల వర్షానికి 650ఎకరాలలో పంట నష్టం జరిగింది
- నష్ట పరిహారం అందించే విధంగా కృషి చేస్తా : ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**రాయికల్, జనంసాక్షి :** రైతులు అధైర్య పడవద్దు అని,అకాల వర్షాలకు 650 ఎకరాలలో పంట నష్టం జరిగిన వెంటనే జిల్లా,మండల స్థాయి వ్యవసాయ అధికారులు,రెవెన్యూ అధికారుల తో రైతులతో మాట్లాడడం జరిగింది అని,పంట నష్టాన్ని అంచనా వేయటం జరిగింది అని,ముఖ్యమంత్రి తో మాట్లాడడం జరిగింది అని, రైతులు నష్ట పరిహారం అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు.రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని,వ్యవసాయ యంత్రాల పంపిణీ లో పంట నష్టపోయిన రైతులకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.దేశంలో ఎక్కడాలేని విధంగా ఏకకాలంలో 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయడం జరిగిందని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఆకాల వర్షాలకు దెబ్బతినడం చాలా బాధాకరం అన్నారు.జిల్లా కలెక్టర్ ఇప్పటికే పంట నష్ట రిపోర్ట్ పంపడం జరిగింది అని, ప్రభుత్వం పంట నష్ట పరిహార చర్యలు చేపడుతుంది అని ధైర్యంగా ఉండాలని రైతులను కోరారు.వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పంట నష్ట పోయిన రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి అని అధికారులను ఆదేశించారు. త్వరలో రైతు భరోసా కూడా ప్రభుత్వం ఇస్తుంది అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పైన ఈ ప్రభుత్వం వచ్చాక 33వేల కోట్ల అసలు వడ్డీ రూపంలో చెల్లించింది అని గుర్తు చేశారు.ప్రభుత్వం ఆర్థిక లోటు ఉన్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుంది అన్నారు. అందరికీ అండగా ఉంటా అన్నారు.కౌలు రైతులు,రైతు కూలీల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్,మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు,మండల నాయకులు కోల శ్రీనివాస్,ఏనుగు మల్లారెడ్డి,సురేందర్ నాయక్, ఉప సర్పంచ్ సుధీర్, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ ముఖీద్, వార్డుసభ్యులు నారాయణ, భరత్ రెడ్డి,విజయ్,నర్సా రెడ్డి,నాయకులు బేతి మోహన్ రెడ్డి, భీతి మల్లారెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ ముక్తేశ్వర,అధికారులు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధి

- టిఆర్ఎస్ కార్పొరేటర్లతో ప్రమాణస్వీకారం చేయించిన మేయర్ 'మహంకాళి'



**గోదావరిఖని, జనంసాక్షి :** పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధికి పాటుపడదామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. బి ఆర్ ఎస్ సభ్యులచే గురువారం మేయర్ ఛాంబర్ లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సశీధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యలను పరిష్కరిశీచడానికి ప్రతి వార్డు సభ్యుడు పని చేయాలని అన్నారు. రామగుండం శాసన సభ్యులు ఎం . ఎస్. రాజ్ ఠాకూర్ నగర అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తున్న తరుణంలో ప్రజల సమస్యలు గుర్తించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిద్దామ ని అన్నారు. సుమారు 800 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కొనసాగు తున్నదని అన్నారు. కాగా ఈ సంధర్భంగా బిఆర్ఎస్ పార్టీ సభ్యులు ఆకారపు రేఖ (51వ డివిజన్), కర్క పద్మజ (55వ డివిజన్ ) , తాళ్ల చిన్న రాజయ్య (20వ డివిజన్), దారంగుల కుమార్ (28వ డివిజన్), నిమ్మరాజుల రజిని (29వ డివిజన్), బదావత్ నర్సమ్మ (26వ డివిజన్) , బుర్ర శశికళ (15వ డివిజన్), మేకల శారద ( 60వ డివిజన్ ) మేకల సమ్మయ్య (58వ డివిజన్), రమ మందల (16వ డివిజన్), శ్యామణి ఆవుల (6వ డివిజన్) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్, ఎసిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అదృశ్యం

**గంభీరావుపేట ఫిబ్రవరి 26 (జనం సాక్షి);**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలో ని బరిగేల గూడెం కు చెందిన చుక్క సంగీత (46) (మాదిగ)అను ఆమె నిన్న రాత్రి కుటుంబ సభ్యుల తో కలిసి భోజనం చేసి అందరూ పడుకున్నారు, గురువారం రోజున తన భర్త అయినా చుక్క బాబు ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేచి చూసేసరికి తన భార్య కనిపించడం లేదు అని, చుట్టుప్రక్కల ఎక్కడ వెతికిన ఆమె జాడ తెలియలేదు అని ఫిర్యాదు రాగా, ఫిర్యాది ఇంటికి వెళ్లి దరఖాస్తు తీసుకొని కేసు నమోదు చేయడమైనది ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు

# మావోయిస్టులు తుపాకిని వీడి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

- అలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26 ( జనంసాక్షి) :** మావోయిస్టులు తుపాకిని వదిలి జన జీవవన స్రవంతిలో కలిసి ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగా ణ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం రోజు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ... తుపాకీ పోరాటం ఒక్కటే పరిష్కా రం కాదని, మావోయిస్టులు అడవుల్లో ఉండి ఎన్‌కౌంటర్లకు గురవుతూ కుటుంబాలను నాశనం చేసుకోవడం కంటే ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యల కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడాలని సూచించారు. అడవి సంపదను పెత్తందార్లకు కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులను అణిచివేస్తున్నారని ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి తెలిపారు. సుభాష్ చంద్ర బోస్ ఆశయాల మేరకు ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య మార్గంలో ఉద్యమించాలన్నారు. పోలీసులు, రాజకీయ నాయకుల కోసం కాకుండా ప్రజల కోసం పని చేయాలని ఆయన కోరారు. అడవుల్లో ఉన్న నాయకులు బయటకు వచ్చి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు ప్రజా సమస్యల కోసం పోరాడాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆహ్వానిస్తుందని అంబటి జ్యోతి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి తేజ్ దీప్ రెడ్డి మాట్లాడుతూ... మావోయిస్టులు ఆయుధాలను విడిచి ప్రజా సమస్యల పై ఉద్యమించేందుకు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు విజయ్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కాలేజీలో టీసీఎస్ క్యాంపస్ డ్రైవ్ విజయవంతం

- అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో, తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కాలేజ్, కరీంనగర్‌లో ఘనంగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారని కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ డ్రైవ్‌కు టీసీఎస్ టాలెంట్ అక్విజిషన్ గ్రూప్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టీమ్ నుండి హెచ్ఆర్ ప్రతినిధులు వేములపల్లి సీతాల్, శ్రేయా చక్రవర్తి ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థినులకు మార్గదర్శనం చేశారు. టీసీఎస్‌లో ఉద్యోగావకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, ఇంటర్వ్యూ విధానం వంటి అంశాలపై వారు సమగ్రంగా వివరించారు. టాస్క్ ప్రాంతీయ సమన్వయకర్తలు గంగప్రసాద్ (కరీంనగర్), సాయికుమార్ (మంచిర్యాల), శ్రీధర్ (రాజన్న సిరిసిల్ల) ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు మార్గనిర్దేశనం చేశారు. ఆల్ఫోర్స్ కళాశాల కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరై, విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ఇలాంటి క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో సుమారు 1200 మంది విద్యార్థినులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, టాస్క్ ప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించారు. గురువారం రోజు అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి దశకి సంబంధించిన ఆన్లైన్ సిపిట్ పరీక్ష నిర్వహించామనీ, తదుపరి ఫలితాలు షార్ట్ లిస్ట్ అయిన విద్యార్థులకు ఇమెయిల్ ద్వారా అందుకుంటారని తెలిపారు. అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కాలేజ్ విద్యార్థినులకు ఉత్తమమైన కెరీర్ అవకాశాలను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు వి. రవీందర్ రెడ్డి తెలిపారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి);**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని కలెక్టర్ ఛాంబర్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా గరిమ అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి కలెక్టర్‌గా గరిమ అగ్రవాల్ అక్టోబర్ 23వ తేదీ 2025న బాధ్యతలు స్వీకరించారు. గరిమ అగ్రవాల్‌ను జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు అర్చకులు ఆశీర్వచనం అందించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియ జేశారు. ఇట్టి కార్యక్రమంలో ఏవో రామ్‌రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

- సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు




తిరువనంతపురం, ఫిబ్రవరి26 (జనంసాక్షి) : సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.

# కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

- రెండేళ్ల పాలనచూసి ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారు
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మాజీ మంత్రి కేటీఆర్ కు ప్రజల సమస్యలు పట్టవు..
- ముఖ్యమైన విషయంలో సైతం అసెంబ్లీకి రారు..
- ప్రతిపక్షాలు మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




హైదరాబాద్ (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేయడంతో పాటు కోట్లు రూపాయాలు కమీషన్లు తీసుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేశారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం గాంధీ భవన్లో. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మీడియా సెల్ కన్వీనర్ సామ రామ్మోహన్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ...కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అప్పులు తీసుకువచ్చిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనికి రూ. 47వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వచ్చిందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కమీషన్లు దండుకుందని అన్నారు. దేశంలోనే, ప్రపంచంలోనే ఎక్కడ లేని చెప్పారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఒక్క చుక్క నీరు ఇవ్వలేదని మంత్రి అన్నారు. కాళేశ్వరంలో చేసిన అవినీతికి ఇతర దేశాల్లో అయితే కఠిన శిక్షలు విధించే వారని మంత్రి అన్నారు. మన రైతులకు సంబంధించి రైతు బంధు, మూసీ ప్రక్షళన గురించి ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన పని వలన ప్రతి నెల రూ. 6వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పాడిందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్కు చేసిన అప్పుతో ఇప్పటికే రూ. 47వేల కోట్లు చెల్లించాలమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి గారితో పాటు ప్రభుత్వంపై బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని మంత్రి తెలిపారు. కాళేశ్వరం విషయంలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ముఖ్యమైన అంశాల విషయంలో ప్రత్యేకం మాట్లాడానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఏనాడు అసెంబ్లీకి రాలేదని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న సమయంలో ఏనాడు ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ప్రజాపాలనలో ప్రజలు తమ వెంట ఉన్నారని, రెండేళ్ల పరిపాలనతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట ఉన్నారని ఏలాగైన ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయాలని రాజ్యాంగ బద్దంగా ఉన్న ముఖ్యమంత్రిని ఏక వచనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టె ప్రయత్నంలో భాగంగా కాళేశ్వరం వడ్డీలను తగ్గించడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటిల్లో నాలుగు అమలు చేస్తున్నామని మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

- లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం
- మాజీమంత్రి తలసాని హెచ్చరిక



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు. దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా ? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# రాష్ట్రంలో అభివృద్ధిపై వందరోజుల కార్యక్రమాలు

- మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ
- ప్రతీ శాఖ వందరోజుల కార్యాచరణపై ప్రణాళిక
- మార్చి 1న జిల్లా కలెక్టర్లతో సిఎం రేవంత్ సమావేశం
- అధికారుల సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్ ,సి.వీ ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్.ఓ.డి లలో ఈ-ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

## పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.

# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

## ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి26 (జనంసాక్షి) : భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అర్జెంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్ల సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ


హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఎటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ, శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

- పెంచితే ఖజానాపై భారీగా భారం
- పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు
- మల్లగుల్లాలు పడుతున్న అధికార పక్షం

హైదరాబాద్, ఫిబ్రవరి26 (జనంసాక్షి) : ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బిఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది. 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బ్జడెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బ్జడెట్‌లో కేటాయింపులు చేయన్నున్నట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

# మూడుముళ్ల బంధంతో ఒక్కటైన విరోష్



- పెళ్లి ఫోటోలను షేర్ చేసిన రష్మిక

ఉదయ్‌పూర్, ఫిబ్రవరి26 (జనంసాక్షి) : విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ' అని పేర్కొన్నారు. ఇకపోతే పరిమిత సంఖ్యలోనే పెళ్లి వేడుకకు అతిథులు హాజరయ్యారు. ఇరు కుటుంబ సభ్యుల మధ్య వేడుక జరిగిందని సమాచారం. 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.



# ముఖ్యమంత్రి ఆశీర్వాదం

*నార్సింగి అడ్రస్ కన్వెన్షన్‌లో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం లక్ష్మణ్ కుమార్తె శ్రేయ వివాహానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించారు.*

*- హైదరాబాద్ (జనంసాక్షి)*

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370